పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 714 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శుక్రవారం 11.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## ఎల్ నినోపై చంద్రబాబు సమగ్ర వ్యూహం

# కలెక్టర్లకు కీలక ఆదేశాలు

### అమరావతిలో 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు

- 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- తాగునీరు, పశుగ్రాసానికి కొరత రాకుండా చూడాలని సూచన
- రైతులు, వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం
- ఎల్ నినోపై ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తానన్న ముఖ్యమంత్రి



రాష్ట్రంపై 'సూపర్ ఎల్ నినో' ప్రభావం పొంచి ఉన్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసింది. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశంపై లోతుగా చర్చించి, అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో విపత్తును ఒక సవాల్‌గా స్వీకరించి, రైతులు, వినియోగదారులపై దాని ప్రభావం పడకుండా చూడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్కర తరువాయి 2లో



2లో

నాగార్జున వర్సిటీ గోల్డెన్ జూబ్లీకి

## ప్రత్యేక గుర్తింపు..

- పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన నారా లోకేశ్
- ఆచార్య నాగార్జున వర్సిటీ 50 ఏళ్ల ప్రస్థానం
- స్వర్ణోత్సవ స్టాంప్ ఆవిష్కరణ
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా విడుదల
- కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ ఉన్నతాధికారులు, వర్సిటీ వీసీ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) 50 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా రూపొందించిన ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. గురువారం సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. యూనివర్సిటీ స్వర్ణోత్సవ (గోల్డెన్ జూబ్లీ) వేడుకలు చిరకాలం గుర్తుండిపోయేలా ఈ ప్రత్యేక స్టాంప్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. తరువాయి 2లో

## ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..

# సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ




- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

2లో



గల్వాన్ తర్వాత తొలిసారి

### మోదీ–జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

- సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు
- మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి అవకాశం
- 2020 గల్వాన్ తర్వాత ఇదే తొలి ముఖాముఖి చర్చ
- అజిత్ దోవల్ ఇటీవల చైనాలో చర్చలు
- సరిహద్దు, వాణిజ్యం, భద్రతపై చర్చకు అవకాశం

ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్‌చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ తరువాయి 2లో

చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

## కార్గో నౌకలో 20 మంది మృతి



- చైనాలోని కింగ్‌డావో షిప్‌యార్డ్‌లో కార్గో నౌకలో భారీ అగ్నిప్రమాదం
- ఈ దుర్ఘటనలో 20 మంది సిబ్బంది మృతి, ఐదుగురు గల్లంతు
- మరమ్మతుల కోసం ఆగిన 'ఓషన్ మెలోడీ' నౌకలో ఘటన
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం

2లో

జోర్డాన్‌లోని యూఎస్ బేస్‌పై ఇరాన్ దాడి

## పలు యుద్ధ విమానాల ధ్వంసం

- దాడిలో పలు యూఎస్ యుద్ధ విమానాలు దెబ్బతిన్నాయని రిపోర్ట్
- ఇరాన్ దాడులను ప్యాట్రియాట్ క్షిపణులతో తిప్పికొట్టిన అమెరికా దళాలు
- ఎన్నికల తర్వాత యుద్ధం ముగియవచ్చన్న డొనాల్డ్ ట్రంప్



2లో

## మనం సృష్టించిన మేధస్సు..

### మనల్నే మింగేస్తే? ఏఐపై ఎందుకీ దిగ్గజాల హెచ్చరికలు?

- ఏఐ మానవాళికి ముప్పుగా మారొచ్చంటూ నిపుణుల హెచ్చరిక
- పదేళ్లలో సూపర్ ఏఐ ప్రమాదాన్ని ప్రస్తావించిన జాకబ్ కాక్సన్
- ఏఐ సంస్థలు బాధ్యతగా వ్యవహరించడం లేదని ఆరోపణ
- ఏఐ నియంత్రణపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మస్క్
- మనుషులను ఏఐ మించిపోవచ్చన్న జెఫ్రీ హింటన్



ఒకప్పుడు మనిషి యంత్రాలకు ఆలోచించడం నేర్పించాలని కలలు కన్నాడు. ఇప్పుడు ఆ యంత్రాలే మనిషిని మించి ఆలోచిస్తే? అదే జరిగితే పరిస్థితి ఎలా ఉంటుంది? మనిషి ఆపలేని స్థాయికి కృత్రిమ మేధస్సు చేరితే ఏం జరుగుతుంది? ఇది ఇక సైన్స్ ఫిక్షన్ కథల్లో మాత్రమే కనిపించే ప్రశ్న కాదు. ప్రపంచంలోని ప్రముఖ ఏఐ నిపుణులు, టెక్ దిగ్గజాలు ఇదే విషయంపై తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. జీవితాలతో జూదమాడుతున్నారా? తాజాగా జాకబ్ కాక్సన్ తరువాయి 2లో



## లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు..

# ఎర్రకోట వద్ద పేల్చారు..

- 2025 ఢిల్లీ పేలుళ్లలో ఎర్రకోట ఉగ్రవాదుల అసలు లక్ష్యం కాదు
- చాందినీ చౌక్‌లోని లాల్ మందిర్ వద్ద దాడికి తొలుత ప్లాన్
- ట్రాఫిక్, భద్రత కారణంగా చివరి నిమిషంలో ప్రణాళిక మార్పు
- ఎన్ఐఏ చార్జిషీట్‌లో సంచలన విషయాలు వెల్లడి
- ఆత్మాహుతి దాడిలో 11 మంది మృతి.. 29 మందికి గాయాలు

2లో

# ఎల్ నినోపై చంద్రబాబు సమగ్ర వ్యూహం.. కలెక్టర్లకు కీలక ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితుల్లో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, మంత్రులు, అధికారులు, కలెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నీటిపారుదల ప్రాజెక్టుల ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కి చెప్పారు. "ఈ సీజన్‌లో తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల్లోనూ పట్టిసీమ ద్వారా 39.5 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి లక్షల ఎకరాల పంటను కాపాడగలిగాం. ప్రస్తుతం పట్టిసీమ నుంచి 8,100 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ప్రకాశం బ్యారేజీకి 6,700 క్యూసెక్కులు చేరుతోంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని కరవు నుంచి శాశ్వతంగా గట్టెక్కించే 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రాబోయే మూడేళ్లలో పూర్తి చేయాలి" అని లక్ష్యం నిర్దేశించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ, హంద్రీనీవా



పనులను వేగవంతం చేసిన జలవనరుల శాఖ మంత్రిని, అధికారులను అభినందించారు. నిర్దేశిత గడువు కంటే ముందే పనులు పూర్తి చేసే కాంట్రాక్టర్లకు, అధికారులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. ఎల్ నినో ప్రభావం కేవలం వ్యవసాయంపైనే కాకుండా, ద్రవ్యోల్బణం రూపంలో సాధారణ ప్రజలపైనా ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. "పంటలు సరిగా పండకపోతే నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. దీనిని అరికట్టేందుకు మంత్రుల కమిటీ నిరంతరం పనిచేయాలి. రైతు బజార్లను చైతన్యవంతం చేయాలి. భవిష్యత్తులో డిమాండ్ ఉండే ఉల్లి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటి పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలి. అవసరమైతే రాయితీలపై విత్తనాలు అందించి, కనీస మద్దతు ధర ప్రకటించే అంశాన్ని కూడా పరిశీలించాలి" అని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏయే పంటలకు బీమా ఉందో గుర్తించి, ఆ పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, పంట నష్టపోతే బీమా డబ్బులు అందేలా చూడాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను నింపాలని, వచ్చే వేసవి వరకు నీటి సరఫరాకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గతంలో తిరుమలకు నీటి ఎద్దడి వచ్చినప్పుడు 100 రోజుల్లో పైపులైన్ వేసి సంక్షోభాన్ని నివారించిన విషయాన్ని గుర్తుచేశారు. పశువుల దాణాకు కొరత రాకుండా, పచ్చదనం తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాధార పంటలను ప్రోత్సహించడం, పశుగ్రాసం పండించడం, మల్చింగ్ కోసం విత్తనాలు వేయడం వంటి పనులు చేపట్టాలన్నారు. విత్తనాలను డ్రోన్ల ద్వారా చల్లే విధానాన్ని ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. "విపత్తులను మనం ఆపలేం. కానీ, ప్రజలపై వాటి ప్రభావం పడకుండా చూడటమే ప్రభుత్వాల బాధ్యత. 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చాలా ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆగిపోయాయి. అవి పూర్తయి ఉంటే ఇప్పుడు ఇంత ఇబ్బంది ఉండేది కాదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎల్ నినో పరిస్థితులపై ఇకపై ప్రతి వారం సమీక్ష జరుపుతానని, తాను కూడా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

## నాగార్జున వర్సిటీ
# గోల్డెన్ జూబ్లీకి ప్రత్యేక గుర్తింపు..

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక స్టాంప్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా కూడా పంచుకున్నారు. యూనివర్సిటీ 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలు, విద్యారంగానికి అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. స్వర్ణోత్సవాల నేపథ్యంలో చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యామండలి కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర రావు, రెక్టార్ ఆర్. శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ జి. సింహాచలం సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గల్వాన్ తర్వాత తొలిసారి మోదీజిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

(మొదటిపేజీ తరువాయి)

ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

**సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..**

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం**

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీజిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.

## జోర్డాన్‌లోని యూఎస్ బేస్‌పై ఇరాన్ దాడి
# పలు యుద్ధ విమానాల ధ్వంసం

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. జోర్డాన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై బుధవారం రాత్రి ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో పలు అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు సమాచారం. ఈ దాడిలో ఒక ఏ10 థండర్‌బోల్ట్ యుద్ధ విమానం ఎడమ రెక్క పూర్తిగా ధ్వంసమైందని, మరో ఎనిమిది ఎఫ్15 ఫైటర్ జెట్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయని సీబీఎస్ రిపోర్టర్ జెన్నిఫర్ జాకబ్స్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. ఇరాన్ దాడులను తిప్పికొట్టే క్రమంలో జోర్డాన్‌లోని అమెరికా దళాలు 30కి పైగా ప్యాట్రియాట్ క్షిపణులను ప్రయోగించాయి. ఇటీవల అమెరికా యుద్ధ నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకోగా, అందుకు ప్రతీకారంగా అమెరికా ఐదు ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లను ధ్వంసం చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలోనే తాజా దాడి చోటుచేసుకుంది. తాము ఎనిమిది అమెరికా ఆయిల్ ట్యాంకర్లు, రెండు యుద్ధ నౌకలతో పాటు జోర్డాన్‌లోని మువఫఖ్ సల్తీ వైమానిక స్థావరంపై దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నవంబర్‌లో జరగనున్న ఎన్నికల తర్వాత ఇరాన్‌తో వివాదం సద్దుమణగవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధాన్ని సుదీర్ఘకాలం కొనసాగించే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, కేవలం అమెరికా ఎన్నికలను ప్రభావితం చేయడానికే ఆ దేశం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని బుధవారం మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు.

# మనం సృష్టించిన మేధస్సు.. మనల్నే మింగేస్తే? ఏఐపై ఎందుకీ దిగ్గజాల హెచ్చరికలు?

(మొదటిపేజీ తరువాయి)

చేసిన వ్యాఖ్యలు ఈ చర్చను మరోసారి ముందుకు తెచ్చాయి. ఆంత్రోపిక్ నుంచి తప్పుకొన్న ఆయన గతంలో ఓపెన్‌ఏఐలోనూ పనిచేశారు. ఏఐ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్న ఆందోళనతో బయటకు వచ్చినట్లు చెప్పారు. ''మన జీవితాలతో జూదమాడుతున్నారు'' అంటూ ఏఐ సంస్థలపై తీవ్ర ఆరోపణలు చేశారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ.. మనుషులందరినీ చంపగల ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అది వచ్చే పదేళ్లలోనే జరగొచ్చని ఆయన అంచనా వేశారు.

**మస్క్ భయం కూడా ఇదే**

ఇది కాక్సన్ ఒక్కడి అభిప్రాయం కాదు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చాలాకాలంగా ఇదే ప్రమాదాన్ని ప్రస్తావిస్తున్నారు. మనుషుల కంటే ఎన్నో రెట్లు తెలివైన ఏఐను నియంత్రించడం కష్టమవుతుందని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ గ్రిడ్లను హ్యాక్ చేయడం, నీటి సరఫరాలను నిలిపివేయడం, ప్రమాదకర జీవ ఆయుధాల రూపకల్పనకు ఏఐను ఉపయోగించడం వంటి ముప్పుల్ని ఆయన ప్రస్తావించారు. అయితే ఈ హెచ్చరికలు సాధారణ ఏఐ గురించి కాదు. మనిషి చేసే దాదాపు అన్ని మేధో పనులను చేయగల ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) గురించి. ఈ విషయం మస్క్‌కు ప్రత్యేకంగా కీలకం. ఎందుకంటే ఆయన ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆటోమేటిక్ కార్ల సాంకేతికతలోనూ ముందున్నారు.

**మనల్ని మించిపోతే?**

ఏఐ రంగంలో 'గాడ్‌ఫాదర్'గా పేరున్న జెఫ్రీ హింటన్ కూడా గూగుల్ నుంచి తప్పుకొన్న తర్వాత ఇదే ప్రమాదాలపై బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఏజీఐ మనుషులను మేధస్సులో అధిగమించవచ్చని ఆయన హెచ్చరిస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, మనుషులను ప్రభావితం చేయడం, అధికారాన్ని సంపాదించాలనే ప్రమాదకర లక్ష్యాలను స్వయంగా ఏర్పరచుకోవడం వంటి పరిణామాలు సంభవించవచ్చని చెబుతున్నారు. ట్యూరింగ్ అవార్డు గ్రహీత యోషువా బెంగియో సైతం అత్యాధునిక ఏఐ అభివృద్ధిపై కఠిన నిబంధనలు కోరుతున్నారు. భద్రతకు సంబంధించిన ప్రమాణాలు నిరూపితమయ్యే వరకు శక్తిమంతమైన ఏఐ మోడళ్ల శిక్షణను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

**భయం ఒక్కటే కాదు.. బాధ్యత కూడా**

గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హసాబిస్, ఓపెన్‌ఏఐ చీఫ్ సైంటిస్ట్ పాకోచ్కీ, సామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ కూడా ఏఐ వల్ల మానవాళి అంతరించిపోయే ప్రమాదాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని అంగీకరించారు. ఇది ప్రపంచ స్థాయి ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. ఏఐ మనిషి సృష్టించిన అద్భుతమైన సాంకేతికత. కానీ అదే సాంకేతికత మనిషిని మించి వెళ్లిన రోజు ఏం జరుగుతుందన్న ప్రశ్నకు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. బహుశా అసలు పోటీ ఏఐతో కాదు.. మనిషి తన సృష్టిని ఎంతవరకు నియంత్రించగలడన్నదే.

## లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు..
# ఎర్రకోట వద్ద పేల్చారు..

దేశ రాజధాని ఢిల్లీని 2025లో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సంచలన విషయాలను వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవాదులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని తెలిపింది.

**అసలు లక్ష్యం లాల్ మందిర్**

2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలు లక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్ (జైన దేవాలయం). పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. అయితే, ఆ సమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు.

**ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడి**

అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోటలోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు.

**డీఎన్ఏ ఆధారాలతో గుర్తింపు**

ఘటనా స్థలంలో లభించిన ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఈ ఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఏ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది. సీసీటీవీ ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగుతున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు. కేవలం ట్రాఫిక్ కారణంగా ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెను ప్రమాదం నుంచి బయటపడటం గమనార్హం.

# చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం.. కార్గో నౌకలో 20 మంది మృతి

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

# ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ

ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 1213 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు




అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్ దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..



## సంపాదకీయం

### చట్టసభల గౌరవం
# ప్రతిపక్షాల బాధ్యతారాహిత్యం

తెలంగాణ శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు గారు ఆవేదనతో చేసిన సూచనలను శాసనసభ్యులు పాటిస్తే శాసనసభ గౌరవం ఇనుమడిస్తుందని వేరే చెప్పక్కర్లేదు. రెండు తెలుగు రాష్ట్రాలలో కమ్యూనిస్టు పార్టీలకు ఉన్న ఏకైక శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు. కమ్యూనిస్ట్ పార్టీలు ఏకైక శాసనసభ్యుడితోనే పోరాడటం కొత్త కాదు. ఒకనాడు ఓంకార్ గారు, నర్రా రాఘవరెడ్డి గారు తదితరులు సంఖ్యాబలంతో సంబంధం లేకుండా శాసనసభను ప్రభావితం చేయగలిగారు. వారి బాటలోనే నడుస్తూ సాంబశివరావు గారు ప్రజా సమస్యలే ప్రధానంగా మాట్లాడుతూ కమ్యూనిస్టుల అవసరం ఈ దేశానికి ఎంత ఉందో తెలుగు వారికి తెలియజేస్తున్నారు. ఈ పర్యాయం ఆయన ప్రజాసమస్యలతో పాటు శాసనసభలో సభ్యులు ఉపయోగిస్తున్న భాషను ఎండగడుతూ చేసిన సూచనలు, ఆయన చెప్పిన కొన్ని అసభ్య పదాలను ఉపయోగించిన వారు సిగ్గుతో తలదించుకోకపోయినా, భవిష్యత్తులో ఆచితూచి మాట్లాడితే చాలు అనే పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు. చట్టసభల్లో జరిగే చర్చలను ప్రసార మాధ్యమాలు ప్రత్యక్ష ప్రసారం చేయటానికి ప్రభుత్వం ఆమోదించింది చట్టసభల్లో సభ్యులు బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు అనే సదుద్దేశంతోనే. మనం ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు మన సమస్యల గురించి మాట్లాడుతున్నారా లేదా అనేది ప్రజలకు తెలుస్తుంది కాబట్టి, బాధ్యతగా సమస్యల పైన గళం విప్పుతారు అనే ఆశతో ఇది మొదలైంది. 1989 లో లోక్‌సభతో మొదలైన ఈ ప్రసారాలు అంచెలంచెలుగా రాష్ట్రాల చట్టసభల వరకు వచ్చాయి. చట్టసభల ప్రత్యక్ష ప్రసారాలు మొదలైన కొత్తలో సంతోషపడిన తెలుగు ప్రజలు, ఈరోజు శాసనసభా సమావేశాలు చూడటానికే ఇష్టపడటం లేదు. పార్లమెంటు సమావేశాలు జరపటానికి రోజుకి కోటిన్నర నుండి రెండున్నర కోట్ల వరకు ఖర్చు అవుతుంది. మనం ఎన్నుకున్న పార్లమెంటు సభ్యుడికి గౌరవ వేతనం పక్కన పెట్టి, పార్లమెంటులో మన సమస్యల గురించి మాట్లాడటానికి రోజుకి రెండు వేల రూపాయల భత్యం ఇస్తారు. అలాగే శాసనసభా సమావేశాలు జరగటానికి రోజుకి ఇరవై లక్షల నుండి సభ్యుల సంఖ్యను బట్టి యాభై లక్షల వరకు ఖర్చు అవుతుంది. శాసనసభ్యులకు ప్రజా సమస్యల గురించి మాట్లాడటానికి రోజుకి వెయ్యి రూపాయలు ఇస్తారు. వారి ప్రయాణ ఖర్చులు కూడా ప్రజల సొమ్మే. కానీ శాసనసభకు వెళ్లి వీళ్లు ప్రజాసమస్యల మీద కాకుండా వ్యక్తిగత విషయాల పైన పోట్లాడుకుంటున్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ శాసనసభా సమావేశాలను గమనిస్తే, ప్రతిపక్షం తన కార్యాచరణను మొదలుపెట్టడమే రసాభాసతో మొదలుపెట్టింది. నిజంగా ప్రజాసమస్యల మీద పోరాడాలనుకుంటే శాసనసభలో మాట్లాడాలి. ముందే నిరసనల పేరుతో నినాదాలు చేసుకుంటూ వెళితే అది దేనికి సంకేతమో హరీష్ రావుకు తెలియంది కాదు. సమస్యల మీద చర్చించే ఉద్దేశం ఉంటే అల్లరి చేసే ప్రయత్నం చేయరు. ఏదో ఒకటి మాట్లాడి సవాళ్లు విసిరితేనే ఇటువంటి పరిస్థితి వస్తుంది. ఈ విషయంలో 2019 నుండి 2024 మధ్యకాలంలో ప్రతిపక్ష నాయకుడిగా ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు పోషించిన పాత్ర ప్రశంసనీయం. ఆయన రాజకీయ జీవితంలో అది అత్యంత గడ్డుకాలం. ఆయనకు ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం కొత్త కాదు. కానీ ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ లో నడిచింది శాసనసభ అనలేము; అది కౌరవ సభ. జగన్మోహన్ రెడ్డి, ఆయన అనుయాయులు వ్యవహరించిన తీరు చరిత్ర మరచిపోయేది కాదు. ఇప్పుడు కేసీఆర్ మాదిరిగా ఆనాడు చంద్రబాబు సభను విడిచిపెట్టి వ్యవహరించలేదు. ప్రజలు అటువంటి తీర్పు ఎందుకు ఇచ్చారో కానీ, టీడీపీకి ఆరోజు ప్రజలు ఇచ్చిన తీర్పు అవమానకరమైనదే. కానీ ప్రజా తీర్పును శిరోధార్యంగా భావించి, అవమానాలను ఎదుర్కొంటూ కూడా ఆయన తన పదవికి న్యాయం చేకూర్చారు. ఆరోజు చంద్రబాబు కంటే ఈరోజు కేసీఆర్ కు ప్రజలు మంచి తీర్పే ఇచ్చారు. ప్రతిపక్షంగా వారు బలంగానే ఉన్నారు. కానీ కేసీఆర్ ఎందుకు శాసనసభకు వెళ్లడం లేదో అర్థం కాదు. అన్ని వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ ఇంతమాత్రం ఎందుకు ఆలోచించరు? ముఖ్యమంత్రి అయితేనే శాసనసభకు వెళ్లాలి అనుకుంటే, రాజీనామా చేసి ప్రతిపక్ష నాయకుడి హోదాను ఎవరికైనా అప్పగిస్తే గౌరవంగా ఉంటుంది. శాసనసభకు వస్తే రేవంత్ రెడ్డి అవమానం చేస్తాడనే అనుమానంతో రాకపోవటం ఆయన భయాన్ని సూచిస్తుంది. లేదు, రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడలేక రాకపోతే అది ఆయన అసూయకు చిహ్నం అవుతుంది. ఇవన్నీ కాదు, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తన స్థాయి మనిషి కాదు అనుకుంటే అది ఆయన అహంకారాన్ని సూచిస్తుంది. రేవంత్ రెడ్డి స్థాయి ఎంతో ప్రజలే నిర్ణయించే పరిస్థితి కల్పించిందే కేసీఆర్. ఇప్పుడు వగచి ప్రయోజనం ఏముంది? రాజకీయాన్ని ఇంత వ్యక్తిగతం చేసిందే కేసీఆర్. అదే బాటలో నడిచిన జగన్మోహన్ రెడ్డి పరిస్థితి ఏమైందో చూస్తూ కూడా కేటీఆర్ అలాగే వ్యవహరిస్తున్నారు. కూనంనేని అన్నట్లు, శాసనసభలో పిండాలు పెట్టడం, శ్రాద్ధాలు చేయటం లాంటి మాటలు మాట్లాడతారా? ముఖ్యమంత్రి పదవి అనేది వ్యక్తిగత పదవి కాదు; అది ఒక రాజ్యాంగ వ్యవస్థ. దేశవిదేశాల్లో చదువుకున్న వారు మాట్లాడవలసిన మాటలేనా అవి? వైసీపీ అయినా, బీఆర్ఎస్ అయినా అధికారంలో ఉన్నవారు చేసే తప్పులను ఎండగడతారా లేక వ్యక్తులనే తూర్పారబడతారా అనేది వారికే అర్థం కావటం లేదు. ప్రతిపక్షంగా శాసనసభలో ఒక విషయం ప్రస్తావించినప్పుడు ప్రభుత్వం చెప్పే సమాధానం వినాలి. కానీ సమస్యను లేవనెత్తి, ప్రభుత్వం సమాధానం చెప్పే సమయానికి పోడియం ముందుకు వచ్చి నిరసన తెలపడం, లేదా అందరూ కలిసి మూకుమ్మడిగా అరుస్తూ గోల చేయటం అంటే వారు ప్రస్తావించిన అంశం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి వారికే లేకపోవడమే; లేదా ఏదో ఊసుపోక ప్రశ్న అడిగినట్లుగా ఉంటుంది. ఇటువంటి వాటితో సభా సమయాన్ని వృథా చేయటం అంటే ప్రజల ఆశలను భంగపరచడమే అని తెలిసీ అన్ని రాజకీయ పార్టీలూ చేస్తున్నాయి. సీపీఐ నుండి శాసనసభలో ఒక్కరే ఉన్నారు కాబట్టి వారికి కేటాయించే సమయం తక్కువగా ఉంటుంది. ప్రతిపక్షం ఎలాగూ ప్రజా సమస్యల పైన మాట్లాడటం లేదు కాబట్టి, తనకు మరికొంత సమయం ఇస్తే మరికొన్ని సమస్యల మీద మాట్లాడతానని కూనంనేని చేసిన విజ్ఞప్తికి స్పీకర్ హుందాగా స్పందించటం ప్రశంసనీయం. కొద్దిగా అటూఇటుగా అన్ని పార్టీలూ ఇలాగే వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షాలు సరైన పంథాను పాటించనందువలన శాసనసభా కాలం కరిగిపోతూ ఉంటుంది. కాలంతో పాటు ప్రజాధనం కూడా దుర్వినియోగం అవుతూ ఉంటుంది. ఇది పట్టించుకోని రాజకీయ పార్టీలకు ఓటు అడిగే హక్కే లేదు. కానీ ప్రత్యామ్నాయం లేని చోట ప్రజలు కూడా నిస్సహాయులే. సాధారణంగా ప్రజల ఆశలను తీర్చటంలో ప్రభుత్వాలు విఫలమవుతుంటాయి. కానీ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించటంలో ప్రతిపక్షాలే విఫలమవుతున్నాయి. ప్రతిపక్ష నేత హోదా ఉండి కూడా కేసీఆర్ శాసనసభకు రారు. ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదనే భయం లేని జగన్మోహన్ రెడ్డి తాను రాకపోవడమే కాక, తన పార్టీ శాసనసభ్యులను కూడా రానివ్వటం లేదు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటారు; జగన్మోహన్ రెడ్డి యలహంక రాజప్రాసాదంలో ఉంటారు. ప్రజా సమస్యలు పట్టని వీరిద్దరికీ అధికారమే కావాలి. ఇది నిజంగా ప్రజల దౌర్భాగ్యం. ప్రజలు తమ తరపున ప్రజా సమస్యలపై గళమెత్తడానికి మరో నలుగురు కూనంనేని లాంటి నాయకులను ఎన్నుకుంటే బాగుంటుంది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 11

* 1906: మహాత్మా గాంధీ దక్షిణ ఆఫ్రికా లో సత్యాగ్రహం ప్రారంభించాడు.
* 1895: స్వాతంత్ర్యసమరయోధుడు, గాంధేయవాది వినోబా భావే జననం (మ.1982).(చిత్రంలో)
* 1915: భారతదేశ కళాకారిణి, రచయిత్రి పుపుల్ జయకర్ జననం (మ.1997).
* 1947: సాహితీకారుడు దువ్వూరి రామిరెడ్డి మరణం (జ.1895).
* 1948: 20వ శతాబ్దానికి చెందిన రాజకీయనాయకుడు ముహమ్మద్ అలీ జిన్నా మరణం (జ.1876).
* 1983: ఆకాశవాణి ప్రయోక్త, తెలుగు నటుడు ప్రయాగ నరసింహశాస్త్రి మరణం (జ.1909).


వినోబా భావే

* 1987: ఆధునిక హిందీ కవయిత్రులలో ఒకరైన మహాదేవి వర్మ మరణం (జ.1907).
* 2001: ఆల్కాయిదా ఉగ్రవాదులు అమెరికా లోని నాలుగు ప్రధాన పట్టణాలలో విమానాలను ఉపయోగించి ఉగ్రవాదాన్ని ప్రదర్శించారు.

### తిరుమల శ్రీవారికి
## రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

తిరుమల: తిరుమల శ్రీవారికి గురువారం రికార్డు స్థాయిలో రూ.6.93 కోట్ల హుండీ కానుకలు లభించాయి. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వచ్చిన హుండీ కానుకలను గురువారం లెక్కించగా ఈ కానుకలు లభించాయి. తితిదే చరిత్రలో ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే ఒక్కరోజులో రూ.6 కోట్లకు పైగా హుండీ కానుకలు లభించిన రికార్డు ఉంది. కొందరు అజ్ఞాత భక్తులు భారీగా హుండీ కానుకలు వేయడంతో ప్రస్తుత రికార్డు నమోదైనట్లు సమాచారం.



**ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు**

మరోవైపు శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే గురువారం ప్రకటించింది. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సర్వదర్శనానికి 24గంటల సమయం పడుతోంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు వరుస సెలవులు ఉండటంతో రద్దీ మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో 13వ తేదీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది. ఆ సమయాన్ని సామాన్య భక్తులకు కేటాయించనున్నారు. దీంతో శనివారం భక్తుల నుంచి ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించరు.



## ఎమర్జెన్సీ నా జీవితాన్ని మలుపు తిప్పింది

**: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

తెనాలి (కొత్తపేట): దేశంలో విధించిన ఎమర్జెన్సీ తన జీవితాన్ని మలుపు తిప్పిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ఎమర్జెన్సీ పరిస్థితులు లేకపోతే తాను న్యాయవాదిని అయ్యేవాడినని చెప్పారు. గురువారం గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన భాజపా వరిష్టనేత తమిరిశ రామాచార్యుల శతజయంతి ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గుంటూరు టుబాకోబోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. ఎమర్జెన్సీ సమయంలోనే అన్యాయం, అక్రమాలను నిలదీసే తత్వాన్ని అలవర్చుకుని రాజకీయాల వైపు వచ్చినట్లు వెంకయ్యనాయుడు తెలిపారు. ఏబీవీపీ విద్యార్థి సంఘ నేత నుంచి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగినట్లు గుర్తు చేశారు. దివంగత రామాచార్యులు తుదిశ్వాస వరకు ఎలాంటి పదవులు ఆశించకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహరీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వాణీ వంటి అగ్ర నాయకులందరూ తెనాలిలోని ఆయన నివాసానికి వచ్చేవారన్నారు. ఇది ఆయన నాయకత్వ లక్షణాలకు నిదర్శమన్నారు. తెనాలిలో రైళ్లు ఆగేందుకు కూడా ఆయన కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తమిరిశ అనంతాచార్యులు, యడ్లపాటి స్వరూపరాణి, అగ్నిహోత్రం ఆత్రేయబాబు, జూపూడి రంగరాజు పాల్గొన్నారు.

## ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

కంకిపాడు రూరల్ : కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడ సిటీ ఏఆర్ విభాగానికి చెందిన హెచ్ కానిస్టేబుల్ ఆర్లు రాజేశ్.. 2009 బ్యాచ్ ఉద్యోగి. ప్రస్తుతం ఆయన ఆర్డర్ టు సర్వ్‌పై కృష్ణా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలుస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 80ల ట్రెండ్‌లో నారా లోకేశ్.. రెట్రో లుక్‌లో అదరగొట్టిన ఏపీ మంత్రి

- **సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న #80s ట్రెండ్‌లో చేరిన లోకేశ్**
- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో తన రెట్రో ఫొటో క్రియేట్**
- **వింటేజ్ కారు వద్ద నిలబడి 80ల నాటి స్టైల్‌లో కనిపించిన ఏపీ మంత్రి**
- **లోకేశ్ పోస్ట్‌కు నెటిజన్ల నుంచి భారీ స్పందన, మిశ్రమ వ్యాఖ్యలు**

సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్, తాజాగా ట్రెండింగ్‌లో ఉన్న ఓ ఛాలెంజ్‌లో పాలుపంచుకుని నెటిజన్లను ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్న #80sTrendలో ఆయన కూడా జాయిన్ అయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో రూపొందించిన తన 80వ దశకం నాటి రెట్రో లుక్ ఫొటోను ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "జంప్డ్ ఆన్ ది #80s ట్రెండ్" అనే చిన్న క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ఫొటోలో నారా లోకేశ్ పూర్తి రెట్రో అవతార్‌లో



కనిపించారు. ఉంగరాల జుట్టు, రంగురంగుల జామెట్రీ డిజైన్‌తో కూడిన చొక్కా, లేత రంగు జీన్స్ ప్యాంట్‌తో 80ల నాటి ఫ్యాషన్‌ను గుర్తుచేశారు. చొక్కాకు సన్‌గ్లాసెస్ తగిలించుకుని, చేతికి వాచ్‌తో వింటేజ్ లుక్‌ను పూర్తి చేశారు. పక్కనే ఉన్న పాతకాలపు నలుపు రంగు కారు, వెనుకవైపు సూర్యాస్తమయం, తాటిచెట్లతో ఉన్న "1985" అనే బిల్‌బోర్డ్ ఆ ఫొటోకు మరింత రెట్రో అనుభూతిని తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో #80sTrend బాగా ప్రాచుర్యంలో ఉంది. సామాన్య నెటిజన్ల నుంచి సినీ తారల వరకు చాలా మంది ఏఐ టూల్స్ ఉపయోగించి తమ 80ల నాటి ఫొటోలను సృష్టించుకుని షేర్ చేసుకుంటున్నారు. ఇదే బాటలో ఇప్పుడు రాజకీయ నాయకులు కూడా చేరారు. నిత్యం రాజకీయాలతో బిజీగా ఉండే లోకేశ్, ఇలాంటి ట్రెండీ పోస్ట్‌తో తనలోని మరో కోణాన్ని అభిమానులకు చూపించారు. లోకేశ్ పోస్ట్ చేసిన కొద్ది సేపటికే వేలాది లైకులు, వ్యూస్‌తో ఈ ఫొటోకు భారీ స్పందన లభించింది. ఆయన మద్దతుదారులు, అభిమానులు "సూపర్ లుక్", "ట్రెండ్ ఫాలో అవుతున్న యువ నాయకుడు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

## టీడీపీ కార్యకర్త హత్య..
# కోర్టులో లొంగిపోయిన వైసీపీ నేత

- **టీడీపీ కార్యకర్త బాలయ్య హత్య కేసులో కీలక నిందితుడు సత్యనారాయణ రెడ్డి**
- **నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగుబాటు**
- **14 రోజుల పాటు రిమాండ్ విధించిన కోర్టు**

నెల్లూరు, తిరుపతి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సంచలనం సృష్టించిన టీడీపీ కార్యకర్త బాలయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. పిటిషన్‌ను



విచారించిన న్యాయస్థానం ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో, పోలీసులు ఆయనను భద్రత నడుమ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. పెళ్లకూరు మండలం చిల్లకూరు ప్రాంతంలోని కాల్వలు, ప్రభుత్వ పోరంబోకు భూములను సత్యనారాయణ రెడ్డి ఆక్రమించారంటూ స్థానిక టీడీపీ నేతలు గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సంయుక్త సర్వేలో ఆక్రమణ నిజమేనని తేలింది. ఆక్రమిత స్థలంలో తన సొంత పొలానికి దారి వేసుకునేందుకు సత్యనారాయణరెడ్డి ప్రయత్నించగా టీడీపీ కార్యకర్త బాలయ్య సహా పలువురు అడ్డుకుని ప్రశ్నించారు. దీంతో ఆక్రోశానికి గురైన సత్యనారాయణరెడ్డి, తన అనుచరులతో కలిసి టీడీపీ నేతలపై దాడికి తెగబడ్డారు. ఈ గొడవలో బాలయ్య ఛాతీపై ప్రత్యర్థులు పిడిగుద్దులతో విరుచుకుపడటంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సత్యనారాయణ రెడ్డిని ఏ1 నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేయగా... పోలీసు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆయన చివరకు కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది.

# తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయిలో ఆదాయం.. ఇవాళ ఒక్కరోజే రూ.6.93 కోట్లు

- **శ్రీవారి హుండీలో కాసుల గలగల**
- **రూ. 6 కోట్లు దాటడం ఇది నాలుగోసారి మాత్రమేనని తెలిపిన అధికారులు**
- **ఇప్పటివరకు అత్యధికంగా 2023లో రూ. 7.68 కోట్లుగా నమోదైన ఆదాయం**
- **2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,738 కోట్లు దాటిన హుండీ ఆదాయం**

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు సమర్పించే కానుకల ప్రవాహం కొనసాగుతోంది. తాజాగా, శ్రీవారి హుండీ ఆదాయం మరోసారి రికార్డు స్థాయికి చేరింది. గురువారం ఒక్కరోజే రూ. 6.93 కోట్ల ఆదాయం లభించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ఇది ఇటీవలి కాలంలో నమోదైన అత్యధిక ఒక్కరోజు ఆదాయాలలో ఒకటి కావడం విశేషం. గతంలో కేవలం మూడు సార్లు మాత్రమే హుండీ ఆదాయం రూ. 6 కోట్ల మార్కును దాటిందని, ఇప్పుడు ఇది నాలుగోసారి అని అధికారులు పేర్కొన్నారు. తిరుమల చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఒక్కరోజు హుండీ ఆదాయం 2023 జనవరి 2న వైకుంఠ ఏకాదశి పర్వదినాన వచ్చిన రూ. 7.68 కోట్లు. ఆ తర్వాత ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. గతంలో 2022 అక్టోబర్‌లో రూ. 6.31 కోట్లు,



2018 జూలైలో రూ. 6.28 కోట్ల చొప్పున ఆదాయం సమకూరింది. ఇటీవల 2026 ఆగస్టు నెలలో కూడా ఒకేరోజు రూ. 6.1 కోట్ల ఆదాయం వచ్చింది. వార్షికంగా చూస్తే, శ్రీవారి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 202526 ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ. 1,738 కోట్ల ఆదాయం నమోదైంది. సాధారణ రోజుల్లో శ్రీవారి హుండీకి సగటున రూ. 3 నుంచి 5 కోట్ల వరకు ఆదాయం వస్తుంటుంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న హిందూ దేవాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన తిరుమల క్షేత్రానికి భక్తులు నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీ రూపంలో భారీగా కానుకలు సమర్పిస్తుంటారు. ఈ నిధులను టీటీడీ ఆలయ నిర్వహణ, అభివృద్ధి, అన్నప్రసాద వితరణ, ఇతర ధార్మిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంది.

## విజయవాడ-తిరుపతి ఇక గంటలోనే..
# అందుబాటులోకి కొత్త విమాన సర్వీస్.. తక్కువ ధరకే టికెట్లు

- **విజయవాడ-తిరుపతి మధ్య ఫ్లై 91 కొత్త విమాన సర్వీసు ప్రారంభం**
- **రోడ్డు మార్గంలో 8 గంటల ప్రయాణం ఇక గంటకు తగ్గింపు**
- **విమాన ప్రయాణికులకు ఎయిర్‌పోర్టులోనే శ్రీవాణి దర్శనం టికెట్లు**
- **వారానికి నాలుగు రోజులు అందుబాటులో సేవలు**
- **రూ.3,000 నుంచి రూ.3,500 మధ్య విమాన టికెట్ ధర**

తిరుమల శ్రీవారి భక్తులకు, ముఖ్యంగా విజయవాడ నుంచి ప్రయాణించే వారికి ఒక శుభవార్త. విజయవాడ, తిరుపతి నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు కొత్త విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చింది. 'ఫ్లై 91' విమానయాన సంస్థ ఈ రెండు నగరాల మధ్య నేరుగా విమాన సేవలను ప్రారంభించింది. దీనివల్ల సాధారణంగా రోడ్డు మార్గంలో పట్టే 7 నుంచి 8 గంటల ప్రయాణ సమయం కేవలం గంటకు పరిమితం కానుంది.




**విమాన సమయాలు.. టికెట్ ధరలు**

ఈ కొత్త సర్వీసు వారానికి నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 8:05 గంటలకు తిరుపతిలో బయలుదేరిన విమానం, 9:15 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటుంది. తిరిగి ఉదయం 9:45 గంటలకు విజయవాడలో బయలుదేరి, 10:50 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ ప్రయాణానికి టికెట్ ధర సుమారు రూ.3,000 నుంచి రూ.3,500 మధ్య ఉంటుందని ఫ్లై 91 సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**ప్రయాణికులకు టీటీడీ ప్రత్యేక సౌకర్యం**

ఈ విమానంలో ప్రయాణించే భక్తులకు టీటీడీ మరో అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. విమాన ప్రయాణికులు తిరుపతి విమానాశ్రయంలోనే శ్రీవారి దర్శన టికెట్లు పొందే సౌకర్యం ఉంది. ఎయిర్‌పోర్టులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీటీడీ కౌంటర్‌లో తమ విమానం బోర్డింగ్ పాస్, ఆధార్ కార్డు చూపించి శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లను కొనుగోలు చేయవచ్చు. ఇందుకోసం శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10,000 విరాళం, దర్శనం టికెట్ కోసం రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. టీటీడీ ఈ కోటా కింద ప్రతిరోజూ 200 టికెట్లను అందుబాటులో ఉంచుతోంది. తక్కువ సమయంలో ప్రయాణం, ఎయిర్‌పోర్టులోనే దర్శనం టికెట్లు లభించే ఈ సదుపాయం భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా మారనుంది. తక్కువ ధర, వేగవంతమైన ప్రయాణంతో ఈ సర్వీసుకు మంచి స్పందన వస్తుందని అంచనా వేస్తున్నారు.

## నాగబాబుకు కేబినెట్ హోదా..
# నెలకు రూ. 4.50 లక్షల జీతభత్యాలు!

- **ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబుకు కేబినెట్ హోదా**
- **జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు**
- **నెలకు రూ. 2 లక్షల జీతం.. రూ. 2.50 లక్షల అలవెన్సులు**
- **మొత్తం రూ. 4.50 లక్షల మేర ప్రయోజనాలు అందే అవకాశం**

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జీతభత్యాలు, వ్యక్తిగత సిబ్బంది నియామకం, ఇతర ప్రయోజనాలను ఖరారు చేస్తూ పర్యావరణ, అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల కాపీలను ఆర్థిక శాఖ సహా సంబంధిత శాఖలకు పంపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో, కేబినెట్ హోదా పొందిన వారికి వర్తించే ప్రయోజనాలకు సంబంధించి 2025 జనవరి 10న విడుదల చేసిన జీవో నంబర్ 7ను ప్రస్తావించారు. ఈ జీవో ప్రకారం కేబినెట్ హోదాలో ఉన్న వారికి నెలకు రూ. 2 లక్షల జీతం చెల్లిస్తారు. దీనికి అదనంగా, కార్యాలయ ఫర్నీచర్ ఏర్పాటు, వ్యక్తిగత సహాయ సిబ్బంది అలవెన్సులు,



ఇతర సౌకర్యాల కల్పన కోసం వన్‌టైం గ్రాంట్‌గా మరో రూ. 2.50 లక్షలు అందిస్తారు. దీంతో జీతం, అలవెన్సులు అన్నీ కలిపి నెలకు మొత్తం రూ. 4.50 లక్షల వరకు ప్రయోజనాలు అందనున్నాయి. నాగబాబుకు కూడా ఇదే ప్యాకేజీ వర్తిస్తుందని స్పష్టమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే పలువురిని కేబినెట్ హోదాలో నియమించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా నియమితులైన పెందుర్తి వెంకటేశ్, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌లకు కేబినెట్ హోదా ఉంది. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన సత్యనారాయణ రాజు, మాజీ కార్టూనిస్ట్ పోచంపల్లి శ్రీధర్ రావులకు కూడా ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఇప్పుడు ఈ జాబితాలో నాగబాబు కూడా చేరారు.

# కాకినాడ జిల్లాలో పులి సంచారం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- **కాకినాడ జిల్లాలో పులి సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష**
- **పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశం**
- **అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన**

కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన



ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## భారీ చోరీ.. 46 సవర్ల బంగారం,
# 2.4 కిలోల వెండి అపహరణ

చిలకలూరిపేట గ్రామీణం: పల్నాడు జిల్లా యడ్లపాడులో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని పార్వతి హైదరాబాద్ వెళ్లిన సమయంలో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు.. 46 సవర్ల బంగారం, 2.4 కిలోల వెండి, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే యడ్లపాడు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్ బృందం ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించింది. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో దుండగుల కదలికలు రికార్డైనట్లు గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు.

# ఏపీలో కొత్త IASల పోస్టింగ్‌లకు బ్రేక్.. గంటల వ్యవధిలోనే ఉత్తర్వులు వెనక్కి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. 2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ అధికారులకు సబ్‌కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. మంగళవారం రాత్రి జారీ అయిన ఈ ఆదేశాలను బుధవారం ఉదయానికల్లా హోల్డ్‌లో పెడుతూ ప్రభుత్వం తిరిగి ఉత్తర్వులు ఇవ్వడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా




మారింది. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మంగళవారం రాత్రి 2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ అధికారులను వివిధ సబ్ డివిజన్లకు సబ్ కలెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం సందీప్ రఘువంశీ (తెనాలి), కె. చిరంజీవి నాగవెంకట సహిత (పాడేరు), డి. పృథ్వీ రాజ్ కుమార్ (రంపచోడవరం), చిట్టిపులి నరేంద్ర పాడల్ (చింతూరు), సచిన్ రహర్ (పార్వతీపురం), ఫరీజ్ జహీద్ (పెనుకొండ), మనీషా (నంద్యాల)లకు పోస్టింగ్‌లు ఖరారు చేశారు. అదేవిధంగా, 2023 బ్యాచ్‌కు చెందిన అధికారి, అప్పటి చింతూరు సబ్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్‌ను రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ సబ్‌డివిజన్లలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, డీఆర్‌ఓలు వెంటనే సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల్లోనే ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. బుధవారం ఉదయం ఈ నియామకాలు, బదిలీలన్నింటినీ హోల్డ్‌లో పెడుతున్నట్లు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆకస్మిక నిర్ణయానికి గల కారణాలు మాత్రం అధికారికంగా వెల్లడి కాలేదు.

# ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో గేమ్‌చేంజర్!



* ఎఫ్‌టీపీసీ ఇండియా ఆధ్వర్యంలో మూడు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు శ్రీకారం
* రూ.2 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికతో భారీ విస్తరణ
* వినోద రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం
* కొత్త ప్రతిభకు ప్రపంచస్థాయి వేదిక కల్పించనున్న ఎఫ్‌టీపీసీ ఇండియా
* ఇండీఫ్లిక్స్, లస్టారా, యూనీఎంట్ లోగోల ఆవిష్కరణ

హైదరాబాద్: డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో వేగంగా పెరుగుతున్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఎఫ్‌టీపీసీ ఇండియా కీలక ముందడుగు వేసింది. సినిమా, టెలివిజన్ రంగాల అభివృద్ధే లక్ష్యంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక వర్క్‌షాప్‌లు, ఫిల్మ్ ఎక్స్ఛేంజ్ ఈవెంట్లు, అవార్డు కార్యక్రమాలను నిర్వహిస్తూ తనదైన ముద్రతో ముందుకు సాగుతున్న ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మరో కీలక అడుగు వేసింది. సంస్థ ఆధ్వర్యంలో మూడు కొత్త ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇండీఫ్లిక్స్, లస్టారా, యూనీఎంట్ పేర్లతో అందుబాటులోకి రానున్న ఈ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల లోగోలను మంగళవారం హైదరాబాద్‌లోని కంట్రీ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా ఆవిష్కరించారు. భారతీయ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న డిజిటల్ మార్పులకు అనుగుణంగా ఈ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటెంట్ సృష్టి నుంచి పంపిణీ వరకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, దేశీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను చేరుకునేలా వ్యూహాలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి నోయిడా ఫిల్మ్ సిటీ ఎండీ డాక్టర్ సందీప్ మార్వా, లండన్ వరల్డ్ బుక్ రికార్డ్స్ చైర్మన్ డాక్టర్ జితేంద్ర మతలానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని, కొత్త తరం ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా వినూత్న కంటెంట్‌ను అందించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. మూడు కొత్త ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రారంభం ఆ రంగంలో గేమ్‌చేంజర్‌గా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**రూ.2 వేల కోట్లతో విస్తరణ ప్రణాళికలు**

ఎఫ్‌టీపీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, జనరల్ సెక్రటరీ వీస్ విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ సంస్థ విస్తరణలో భాగంగా సుమారు రూ.2 వేల కోట్లతో వివిధ ప్రణాళికలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ ఓటీటీ సంస్థల సరసన నిలిచేలా భారీ ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అలాగే ఒక లక్ష మంది నటీనటులు, సాంకేతిక నిపుణులకు తమ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. ఓటీటీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ రంగాలను సమన్వయం చేస్తూ సమగ్ర డిజిటల్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కంటెంట్ క్రియేటర్లు, నటీనటులు, రచయితలు, సాంకేతిక నిపుణులు, డిజిటల్ మీడియా నిపుణులు, పోస్ట్ ప్రొడక్షన్ రంగానికి చెందిన వారికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

*** కొత్త ప్రతిభకు ప్రోత్సాహం**

ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఇప్పటికే ఉన్న ప్రతిభతో పాటు కొత్త ట్యాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎఫ్‌టీపీసీ ప్రతినిధులు తెలిపారు. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులకు కూడా డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అవకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన నటీనటులు, దర్శకులు, రచయితలు, సంగీత దర్శకులు, టెక్నీషియన్లు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ ప్లాట్‌ఫామ్‌లు వేదికగా నిలవాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. నాణ్యమైన, విభిన్నమైన కంటెంట్‌ను ప్రోత్సహించడం ద్వారా కొత్త తరం కంటెంట్ క్రియేటర్లకు అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

*** టెక్నాలజీ ఎక్స్ఛేంజ్‌కు కొనసాగింపు**

ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో టెక్నాలజీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను మరింత విస్తృతంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు.




అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, నిపుణుల మధ్య సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, కొత్త సాంకేతిక పరిష్కారాల వినియోగంపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఓక్లెట్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం కీలక అడుగుగా భావిస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను వినియోగించి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఓక్లెట్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఎండీ కోడే శ్రీచైతన్య మాట్లాడుతూ, ఎఫ్‌టీపీసీ ఇండియాతో భాగస్వామ్యం తమ సంస్థకు కీలక అవకాశమని అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు నాణ్యమైన వినోదాన్ని అందించే దిశగా పనిచేస్తామని తెలిపారు. భారతీయ కంటెంట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో, దేశీయ ప్రతిభను అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేయడానికి ఈ ప్లాట్‌ఫామ్‌లు దోహదపడతాయని డిజిటల్ మీడియా హెడ్, ఎం. ఈశ్వర్ పేర్కొన్నారు. సాంకేతికత, కంటెంట్, వినోదాన్ని సమన్వయం చేస్తూ వినియోగదారులకు మెరుగైన అనుభూతిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలకు ప్రధాన కేంద్రంగా భావిస్తూ ఇక్కడి నుంచి కార్యకలాపాలను మరింత విస్తరించాలని సంస్థ భావిస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ బోర్డు డైరెక్టర్లు సయ్యద్ గౌస్, ప్రియాంక సూర్యవంశీతో పాటు ప్రముఖ బాలీవుడ్ నటి పాయల్ ముఖర్జీ పాల్గొన్నారు. కొత్త ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రారంభం, టెక్నాలజీ సంస్థలతో భాగస్వామ్యం, భారీ పెట్టుబడి ప్రణాళికలు ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో కొత్త అవకాశాలకు నాంది పలుకుతాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. డిజిటల్ వినోద రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కంటెంట్, టెక్నాలజీ, ప్రతిభాభివృద్ధి, ఉపాధి కల్పన అనే నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారిస్తూ ఎఫ్‌టీపీసీ ఇండియా రూపొందిస్తున్న ప్రణాళికలు రాబోయే రోజుల్లో సంస్థను ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో కీలక సంస్థగా నిలబెట్టే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు

**: హైడ్రా కమిషనర్ రంగనాథ్**

హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రాపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. "కేంద్రం నోటిఫై చేసిన 45 చెరువుల్లోనే



గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచురల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం. పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం" అని రంగనాథ్ తెలిపారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

**: మంత్రి పొన్నం**

హైదరాబాద్: గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా.. ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని చెప్పారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి.. త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. "కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి



100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి

విజయవాడ: అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ సంస్కరణలపై మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలక ప్రకటనలు చేశారు. నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ఇవాళ్టి నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు చోటుచేసుకున్న 4 లక్షల ఎకరాలపై సమగ్ర విచారణ చేపడుతున్నామని, గత ప్రభుత్వం 22 ఏలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22ఏ నుంచి భూముల తొలగింపును సులభతరం చేసేందుకు జీవో 444, కొత్తగా భూములను 22ఏలో చేర్చే విధానాన్ని స్పష్టం చేస్తూ జీవో 445 జారీ చేశామని వివరించారు.

## సి.ఆర్. ఫౌండేషన్, కొండాపూర్ లో సర్వసభ్య సమావేశం-నూతన నాయకత్వం, కార్యవర్గం ఎన్నిక

సి.ఆర్. ఫౌండేషన్ సర్వసభ్య సమావేశం గౌరవ చైర్మన్ డా. కె. నారాయణ గారి అధ్యక్షతన సి.ఆర్. ఫౌండేషన్, కొండాపూర్లో జరిగింది. డా. కె. నారాయణ గారు ఫౌండేషన్ యొక్క మొత్తం కార్యకలాపాలను మరియు విస్తరణ ప్రణాళికలను వివరించారు. కడప, గుంటూరు, గూడూరు ప్రాంతాలలో భవనాలు, భూములు విరాళంగా లభించాయని, అక్కడ వృద్ధాశ్రమాలు నిర్మించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఇందులో కడపలోని వృద్ధాశ్రమం ఇప్పటికే ప్రారంభమై సేవలందిస్తోందని తెలిపారు. అలాగే అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 3 ఎకరాల భూమిని కేటాయించడానికి అంగీకరించిందని, అయితే స్థలం ఖరారు కావాల్సి ఉందని తెలిపారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ పల్లా వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గారు, 2024లో జరిగిన గత సర్వసభ్య సమావేశం తర్వాత గత రెండేళ్లలో జరిగిన కార్యకలాపాలపై నివేదికను సమర్పించారు. అధ్యక్షులు శ్రీ ముప్పాళ్ల నాగేశ్వరరావు గారు వివిధ కేంద్రాల డైరెక్టర్లను తమ నివేదికలను సమర్పించాలని కోరారు.

శ్రీ వి. చెన్నకేశవ రావు, డైరెక్టర్ వృద్ధాశ్రమం; డా. కె. రజని, డైరెక్టర్ సి.ఆర్. పాలీక్లినిక్ & డయాగ్నస్టిక్ సెంటర్; డా. టి. సురేష్‌బాబు, డైరెక్టర్ ఎన్.ఆర్.ఆర్. రీసెర్చ్ సెంటర్; శ్రీమతి జె. కల్పన, డైరెక్టర్ మహిళా సంక్షేమ కేంద్రం తమ తమ కేంద్రాల వివరణాత్మక నివేదికలను, ఆర్థిక వివరాలను మరియు భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను సమర్పించారు.

**భవిష్యత్ ప్రణాళికలు:**

సి.ఆర్. పాలీక్లినిక్: గ్రామీణ ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరేలా





టెలిమెడిసిన్ ద్వారా సేవలను విస్తరించాలని, అలాగే పేదలు మరియు అవసరమైన వారి కోసం డయాలసిస్ సెంటర్ను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది.

ఎన్.ఆర్.ఆర్. రీసెర్చ్ సెంటర్: పాఠశాల పిల్లల కోసం నెలవారీ కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్ను ప్రారంభించాలని; మహిళా సంక్షేమ కేంద్రం (MSK): శిక్షణ నుండి ఉత్పత్తి వైపు కార్యకలాపాలను విస్తరించాలని, కుట్టు మరియు చీర రోలింగ్ సెంటర్లో ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్దేశించ బడింది. సభ్యులు చర్చల్లో చురుకుగా పాల్గొని, ఫౌండేషన్ మరియు దాని వివిధ కేంద్రాల మరింత అభివృద్ధి మరియు మెరుగుదల కోసం పలు సానుకూల సూచనలు మరియు సిఫార్సులు చేశారు. చర్చల అనంతరం, ప్రధాన కార్యదర్శి ఫౌండేషన్లోకి 10 మంది కొత్త సభ్యులను చేర్చుకోవాలని, మరియు నూతన కార్యవర్గం మరియు ఆఫీస్ బేరర్ల ను ప్రతిపాదించారు.

సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ప్రతిపాదనను ఆమోదించి, ఈ క్రింద పేర్కొన్న వారితో కొత్త ఆఫీస్ బేరర్ల ను మరియు కారవర్గం ను ఎన్నుకుంది.

**ఆఫీస్ బేరర్లు :**

1. డాక్టర్ కే నారాయణ గౌరవ అధ్యక్షులు
2. పల్లా వెంకట రెడ్డి Ex.MLA అధ్యక్షులు
3. జల్లి విల్సన్ Ex.MLC ఉపాధ్యక్షులు
4. డాక్టర్ కే రజని ఉపాధ్యక్షులు
5. పిడికిటి సంధ్య కుమారి ఉపాధ్యక్షులు
6. ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి
7. కంభంపాటి అజయ్ కుమార్ కార్యదర్శి
8. మహ్మద్ యూసఫ్ కార్యదర్శి
9. ఏ రామానాయుడు కార్యదర్శి
10. వి చెన్నకేశవరావు కోశాధికారి

**కార్యవర్గ సభ్యులు :**

1 .డాక్టర్ కే నారాయణ
2. పల్లా వెంకటరెడ్డి Ex.MLA
3. అజీజ్ పాషాEx.MP
4. జల్లి విల్సన్ Ex.MLC
5. ముప్పాళ్ల నాగేశ్వర రావు
6. పీజే చంద్రశేఖర రావు Ex .MLC
7. పిడికిటి సంధ్య కుమారి
8. వి చెన్నకేశవరావు
9. చాడ వెంకటరెడ్డి Ex.MLA
10. . కే రామకృష్ణ Ex.MLA
11. డాక్టర్ కే రజని
12. అక్కినేని వనజ
13. కూనంనేని సాంబశివరావు, MLA
14. డాక్టర్ టి సురేష్
15. జోశ్యభట్ల కల్పన
16. కంభంపాటి అజయ్ కుమార్
17. కే శ్రీనివాసరెడ్డి
18. చలసాని రాఘవేంద్ర రావు
19. డాక్టర్ పి. సంజీవమ్మ
20. జి. ఈశ్వరయ్య
21. ఏ . రామానాయుడు
22. నెల్లికంటి సత్యం,MLC
23. బి వి విజయలక్ష్మి
24. డి జవహర్ బాబు
25. మహ్మద్ యూసఫ్

వృద్ధాశ్రమంలో గత 22 సంవత్సరాలుగా ఉంటున్న శ్రీమతి సుబ్బలక్ష్మి గారు, తన మరణానంతరం సి.ఆర్. ఫౌండేషన్కు రూ. 25 లక్షలు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన నిర్ధారణ లేఖను ఆమె మరియు ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఆమె కుమారుడు కంచి బొట్ల శేషాద్రి శర్మ ఆఫీస్ బేరర్లకు అందజేశారు. తిరిగి ఎన్నికైన గౌరవ చైర్మన్ డా. కె. నారాయణ గారు సభ్యులు చేసిన సూచనలను స్వాగతిస్తూ, వాటిని చర్చించి ఫౌండేషన్ ప్రయోజనం కోసం అమలు చేస్తామని తెలిపారు. అన్ని కేంద్రాలు తమ సేవలను మరింత మెరుగుపరచి ఎక్కువ మందికి సేవ చేయాలని, స్వయం సమృద్ధి నమూనాను రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## సి.ఆర్. ఫౌండేషన్, కొండాపూర్ లో మహా శాస్త్రవేత్త డా. ఎలవర్తి నాయుడమ్మ జయంతి వేడుకలు

మహా శాస్త్రవేత్త శ్రీ ఎలవర్తి నాయుడమ్మ జయంతి వేడుకలు సి.ఆర్. ఫౌండేషన్, కొండాపూర్ లోని వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఫౌండేషన్ గౌరవ చైర్మన్ డా. కె. నారాయణ, అధ్యక్షులు శ్రీ ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీ పల్లా వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉపాధ్యక్షులు శ్రీ కంభంపాటి అజయ్ కుమార్, కార్యదర్శి శ్రీ పి.జె. చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ, కార్యదర్శి శ్రీమతి పి. సంధ్యా కుమారి, కోశాధికారి & వృద్ధాశ్రమం డైరెక్టర్ శ్రీ వి. చెన్నకేశవ రావు మరియు ఇతర సభ్యులు డా. నాయుడమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు డా. నాయుడమ్మ చేసిన అమూల్యమైన సేవలను గుర్తుచేసుకున్నారు. డా.



ఎలవర్తి నాయుడమ్మ ప్రముఖ భారతీయ రసాయన ఇంజనీర్, శాస్త్రవేత్త మరియు తోలు సాంకేతికత (లెదర్ టెక్నాలజీ) రంగంలో మార్గదర్శకుడు అని కొనియాడారు. ఒక సాధారణ గ్రామీణ నేపథ్యం నుండి ఎదిగి, సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (CLRI) ని అంతర్జాతీయ గుర్తింపు పొందిన సంస్థగా తీర్చిదిద్దారని, పరిశోధనను పరిశ్రమ మరియు గ్రామీణాభివృద్ధితో అనుసంధానించారని తెలిపారు. సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్ గా మరియు జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (JNU) వైస్‌ఛాన్సలర్ గా ఆయన స్వయం సమృద్ధి, దిగుమతి ప్రత్యామ్నాయం మరియు ఎగుమతి వృద్ధిని ప్రోత్సహించారు. ఆయన విస్తృతంగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు మరియు టానింగ్ ప్రక్రియలలో విప్లవాత్మక ఆవిష్కరణలు చేశారు. ఐక్యరాజ్యసమితి సంస్థలకు కన్సల్టెంట్ గా ఆయన ప్రపంచవ్యాప్తంగా తోలు పరిశ్రమల అభివృద్ధికి సహాయపడ్డారు. 1971లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించబడిన ఆయన, 1985లో ఎయిర్ ఇండియా ఫ్లైట్ 182 బాంబు దాడిలో విషాదకరంగా మరణించారు. పేదల కోసం సైన్స్ పట్ల ఆయనకున్న నిబద్ధత, స్వావలంబన భారతదేశంపై ఆయన దృష్టి నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. ఈ సభలో వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు ఎన్ రాజేంద్ర రావు, వి సాంబశివరావు, తమ్మారెడ్డి తాన్య, ఐదు కళ్ళు అరుణకుమారి, సి ఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ .కూనంనేని రజని, సి ఆర్ పాలి క్లినిక్ సి ఓ కంభంపాటి విజయలక్ష్మి, సి ఆర్ పాలి క్లినిక్ సిఓ దామరచర్ల శ్రీనివాసరావు, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోశభట్ల కల్పన, మహిళ సంక్షేమ కేంద్ర సభ్యులు వయ్యకంటి లలిత, ఉష శ్రీనివాస్ నాయుడు, ఆరుట్ల మమత, సి ఆర్ ఫౌండేషన్ జనరల్ బాడీ సభ్యులు వెల్లంకి అనిల్ కుమార్, ప్రొఫెసర్ బుర్రి రంగారెడ్డి,నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ సురేష్‌బాబు, మల్లంపాటి సుజాత మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, వృద్ధాశ్రమ మేనేజర్ శ్రీనివాస్, ఆశ్రమ వాసులు ,మహిళా కేంద్ర విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# 15వేల మంది పోలీసులు.. 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

బ్రిక్స్ సదస్సు కు దేశ రాజధాని ఢిల్లీ నగరం సిద్ధమైంది. ఈనెల 12, 13 తేదీల్లో ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో భారీగా భద్రతను పెంచారు. దాదాపు 15 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. 200 పారామిలటరీ కంపెనీలను మోహరించారు. విమానాశ్రయాలు, హోటళ్లు, భారత్ మండపం సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేతలు బస చేసే పలు హోటళ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా కోసం సుమారు 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైమానిక



ముప్పును ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా పలువురు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల కోసం అధికారులు ప్రత్యేక మార్గాలను ఖరారు చేశారు.

## సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

చెన్నై(ప్యారిస్): ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీచేసింది. తమ సంస్థ కాపీరైట్ పొందిన సినిమాల పాటలకు ఇళయరాజా హక్కు కోరుతున్నారని, వాటిని వాణిజ్యపరంగా ఉపయోగిస్తున్నట్లు సరిగమ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు గతంలో విచారణ



జరిపి స్టే విధించింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇళయరాజా వాణిజ్యపరంగా పాటలను ఉపయోగిస్తున్నట్లు, ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని తాజాగా సరిగమ పిటిషన్ దాఖలు చేసింది. ఇళయరాజా ఆస్తులను స్వాధీనం చేసుకుని, విక్రయించి వచ్చే నగదుని తమకు ఇవ్వాలని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జవాబివ్వాలని ఇళయరాజాకి ఢిల్లీ హైకోర్టు గురువారం నోటీసులు జారీచేసింది.

## పనులు ఇంత ఆలస్యంగానా..? సిగ్గుగా ఉంది: గడ్కరీ

ముంబయిగోవా జాతీయ రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా సాగుతుండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం సిగ్గుగా ఉందన్నారు. అందుకే రహదారి ప్రారంభోత్సవానికి హాజరుకాబోనన్నారు. గోవాలోని పోర్వోరిమ్‌లో ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబయిగోవా రహదారి నిర్మాణంలో పలువురు కాంట్రాక్టర్లు విఫలమయ్యారని చెప్పారు. బాధ్యతగా పనిచేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు అధికారులను సస్పెండ్ చేసి రికార్డు సృష్టించాలనుకుంటున్నానని పేర్కొన్నారు. ఆ దిశగా కఠిన చర్యలకు వెనకాడబోనని తెలిపారు. ప్రాజెక్టు విషయంలో ఇంతకాలం ఎదురుచూసినప్పటికీ ఆశించిన



ఫలితం రాలేదని గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత విభాగాలు రెట్టింపు వేగంతో పనిచేయాలని సూచించారు. ఈ విస్తరణ పనులు 2016లోనే పూర్తికావాల్సి ఉంది. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వంటి కారణాలతో గడువులు పలుమార్లు దాటిపోయాయి. ప్రస్తుతం పనులు 9394 శాతం పూర్తయ్యాయని గడ్కరీ తెలిపారు. అక్టోబరులో పనులను స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. రహదారి పనుల్లో నాణ్యతపై రాజీ ఉండకూడదని ఆదేశించారు.

## ఆమె సాధ్వీగా మారవచ్చు! మధ్యప్రదేశ్ హైకోర్టు

మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ 20 ఏళ్ల యువతి విషయంలో అక్కడి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వాస్తవిక జీవితాన్ని వదిలేసి సాధ్వీగా మారేందుకు అంగీకరించింది. ఓ మేజర్‌గా, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం, తనకు నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛ ఆమెకు ఉందని పేర్కొంది. ఇటీవల దాఖలైన ఓ రిట్ పిటిషన్ విచారణ సందర్భంగా ఇందౌర్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. ఓ మతాన్ని స్వీకరించి, దీక్ష తీసుకొని సాధ్వీగా మారిపోవాలని నిర్ణయించుకున్నప్పటికీ.. తల్లిదండ్రులు, బంధువులు తన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేధిస్తున్నారని పేర్కొంటూ ఇందౌర్‌కు చెందిన ఓ యువతి హైకోర్టును ఆశ్రయించారు. తనకు తక్షణమే పోలీసు రక్షణ కావాలని విజ్ఞప్తి చేశారు. దీనిని ఇందౌర్ బెంచ్‌లోని జస్టిస్ సందీప్ ఎన్.భట్ సారథ్యంలోని ఏకసభ్య ధర్మాసనం విచారించింది. మేజర్ అయినందున చట్టపరంగా



రక్షణ పొందేందుకు పిటిషనర్‌కు అన్ని హక్కులూ ఉన్నాయని అభిప్రాయపడింది. 18ఏళ్లు పైబడిన వ్యక్తులకు తమ సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉందని, అటువంటి వారి ప్రయోజనాలను కాపాడాల్సి ఉంటుందని గతంలో పలు కేసుల్లో సుప్రీం కోర్టు చెప్పిన తీర్పులను ఈ సందర్భంగా హైకోర్టు ప్రస్తావించింది. కుటుంబీకులు లేదా ఎవరైనా వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తే.. సాయం కోసం పోలీసులను ఆశ్రయించవచ్చని సూచించింది.

## హద్దులు ఉండాల్సిందే..: చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీం

చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉందని, అందుకే వారికి రక్షణ కల్పించేలా హద్దులు ఉండాల్సిందేనని సూచించింది. మైనర్లు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ వేధింపుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కేంద్రానికి



నోటీసులు జారీ చేసింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ ఈ పిటిషన్ వేసింది. సోషల్ మీడియా వినియోగించే విషయంలో మైనర్లకు తగిన రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఆటోమేటిక్‌గా కంటెంట్ ఫిల్టర్ చేసే వ్యవస్థలు ఉండాలని, వయసు ధ్రువీకరణను అమలు చేయడంలో ప్లాట్‌ఫామ్‌లు విఫలమవుతున్నాయని ఆ సంస్థ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. అల్గారిథమ్ ఆధారిత సిఫార్సులు యువతను లైంగిక వేధింపులకు గురిచేసే, వారికి వయసుకు మించిన కంటెంట్‌ను అందిస్తాయని పేర్కొంది. 18 ఏళ్లలోపు పిల్లలు తల్లిదండ్రులు లేక సంరక్షకుల అనుమతి లేకుండా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో నిమగ్నం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరింది.

## రెట్రో లుక్‌లో సీఎం రేవంత్.. 80s ట్రెండ్ ఫాలో అవుతున్న పొలిటీషియన్స్







ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోన్న 80s ట్రెండ్‌లో సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు కూడా వచ్చి చేరుతున్నారు. ప్రజా సమస్యలు తీర్చే మన నాయకులు సరదాగా ట్రెండ్‌ని ఫాలో అవుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు పొలిటీషియన్స్ 80s ట్రెండ్ ఫొటోలను షేర్ చేశారు. జాయినింగ్ '80s ట్రెండ్' అనే క్యాప్షన్‌తో రేవంత్ రెడ్డి వింటేజ్ లుక్ ఫొటో షేర్ చేశారు. పాతకాలపు యమహా బైక్, క్లాసిక్ క్యాసెట్ రికార్డర్, పోస్టర్ల బ్యాక్‌డ్రాప్‌లో 80ల నాటి బెల్‌బాటమ్ శైలి దుస్తుల్లో ఆయన కనిపించడం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. మరోవైపు 'ది ఓజీ ఇన్ 80s' అంటూ ఆంధ్రప్రదేశ్ భాజపా తన అధికారిక పేజ్‌లో ప్రధాని మోదీ ఫొటోను షేర్ చేసింది. ఏదేమైనా.. ఎప్పుడూ ఏదో ఒక సమావేశాలతో బిజీగా ఉండే మన నేతలు యంగ్‌స్టర్స్‌తో కనెక్ట్ అవ్వడానికి ఇలాంటి సోషల్ మీడియా ట్రెండ్స్‌ను సరదాగా ఫాలో అవుతున్నారు. 'రెట్రో లుక్' ఫొటోల్లోని తమ అభిమాన నేతలను చూసుకుంటూ ప్రజలు లైక్స్ వర్షం కురిపిస్తున్నారు.

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు ప్రియాంక కార్యాలయం హెచ్చరిక

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. కృత్రిమ మేధ సాయంతో ఆమె ఫొటోలు, వాయిస్‌ను ఉపయోగించి ఈ వీడియోలు రూపొందించారు. పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రియంకా స్వయంగా చెబుతున్నట్లు ఆ వీడియోల్లో ఉంది. ఈ నకిలీ వీడియోలపై ఆమె కార్యాలయం స్పందించింది. వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించింది. ఏఐతో రూపొందించిన ఆ వీడియోలు మోసపూరితమైనవని స్పష్టం చేసింది. వాటిలోని



లింకులపై క్లిక్ చేయొద్దని, ఎలాంటి పెట్టుబడులు పెట్టొద్దని సూచించింది. ఇలాంటి పోస్టులు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేసి.. బ్లాక్ చేయాలని కోరింది.

## నందన్ నీలేకని.. నిఖిల్ కామత్.. 'సర్' నోటీసుల జాబితాలో!

కర్ణాటకలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా పాత ఓటర్ల జాబితాతో పోల్చితే వివరాలు సరిపోలకపోవడం తదితర కారణాలతో పలువురు ప్రముఖులకూ నోటీసులు జారీ అవుతున్నాయి. తాజాగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఆయన కుటుంబం, జెరోదా వ్యవస్థాపకులు నితిన్ కామత్, నిఖిల్ కామత్ తదితరుల పేర్లు ఈ నోటీసుల జాబితాలో ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. నందన్ నీలేకని, ఆయన కుటుంబ సభ్యుల పేర్లను.. 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాప్ కాని (అన్‌మ్యాప్డ్) కేటగిరీలో చేర్చారు. బెంగళూరు సౌత్ అసెంబ్లీ నియోజకవర్గంలో నితిన్ కామత్, నిఖిల్ కామత్.. వారి తల్లిదండ్రుల పేర్లు మిస్‌మ్యాచ్



అయినట్లు తేలింది. కనకపుర నియోజకవర్గంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తల్లి గౌరమ్మ పేరు విషయంలోనూ సెల్ఫ్‌నేమ్ మిస్‌మ్యాచ్ అయినట్లు వార్తలు వచ్చాయి. అయితే, వెరిఫికేషన్ ప్రక్రియతో ప్రముఖులకు ఎలాంటి అసౌకర్యం కలగదని, సంబంధిత సిబ్బంది వారి వద్దకే వెళ్లి దీన్ని పూర్తి చేస్తారని అధికారులు తెలిపారు.

## తమ్ముడూ విజయ్.. అవును నా దవడ విరిగింది: తమిళనాడు సీఎంకు స్టాలిన్ కౌంటర్

తమిళనాడు అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను అనుకరిస్తూ సీఎం విజయ్ చేసిన సంజ్ఞపై డీఎంకే నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సీఎం విజయ్‌కు స్టాలిన్ దీటుగా బదులిచ్చారు. తమ్ముడూ విజయ్.. అంటూ ఎక్స్ వేదికగా వీడియో సందేశాన్ని షేర్ చేశారు. జైలులో హింస కారణంగా తన దవడకు గాయమైందని గుర్తుచేసుకున్నారు. ఎమర్జెన్సీ సమయం (197577)లో కరుణానిధి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం రద్దయింది. అప్పుడు డీఎంకే పార్టీ యువజన విభాగానికి స్టాలిన్ నాయకత్వం వహించేవారు.



ప్రభుత్వం రద్దయిన సమయంలో స్టాలిన్ అరెస్టయ్యారు. దాని గురించి మాజీ సీఎం ప్రస్తావించారు. "జైలులో చిత్రహింసలు అనుభవించాం. వారు మమ్మల్ని కుష్టువ్యాధిగ్రస్తులతో ఉంచారు. మేమున్న గదిలో ఒకే ఒక్క బాత్రూమ్ ఉండేది. చుట్టూ దుర్వాసన.. అయినా అక్కడే నిద్రించాల్సి వచ్చేది. పోలీసులు మమ్మల్ని రాత్రిపూట నిద్రపోనిచ్చేవారు కాదు. లాఠీలు, బూట్లతో కొట్టేవారు. మమ్మల్ని కొట్టడానికి జీవితఖైదీలను నియమించారు. నాడు నాతోపాటే ఉన్న ఒకరు జైల్లోనే చనిపోయారు" "ఆ దాడిలో నా దవడ ఎముకలు విరిగిపోయాయి. నాకు తగిలిన దెబ్బలు ఈనాటికీ ఉన్నాయి. అదేమీ కాదనను. ప్రజా జీవితంలో ఉన్న చాలా మందికి ముఖ్యంగా తమిళుల కోసం, తమిళనాడు కోసం పోరాడిన వారికి ఇలాంటి అణచివేత ఎదురైంది. మేమంతా ఈ అనుభవాల నుంచి బయటపడ్డాం. పోరాడటం, పర్యవసానాలను ఎదుర్కోవడం మాకు కొత్తేంకాదు. మీరు మీ స్ఫూర్తి అని చెప్పుకొనే అన్నాదురై కాలం నాటి చరిత్ర అది. అదే డీఎంకే చరిత్ర. అందులో నేను భాగమైనందుకు గర్వంగా ఉంది. నా పోరాటం, నా జీవితం గురించి తెలుసుకోండి. మీకు నిజాలు తెలియవు" అని స్టాలిన్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీలో విజయ్ మాట్లాడుతూ డీఎంకే హయాంలో జరిగిన అవినీతి గురించి తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ సమయంలో విజయ్ తన దవడను పైకెత్తుతున్నట్టుగా ఒక సంజ్ఞను చేశారు. దాంతో డీఎంకే నేతల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దాంతో విజయ్ వివరణ ఇచ్చారు. అదంతా అనుకోకుండా జరిగిందని, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని వెల్లడించారు.



తారిక్ రెహమాన్

## మా ప్రధానిని భారత్ సరిగా ఆహ్వానించలేదు: బంగ్లాదేశ్

భారత్ వేదికగా జరగనున్న బ్రిక్స్ సదస్సుకు తమ ప్రధాని తారిక్ రెహమాన్ హాజరుకావడం లేదని బంగ్లాదేశ్ తెలిపింది. తమ ప్రధానిని భారత్ సరిగా ఆహ్వానించలేదని బంగ్లాదేశ్ విదేశాంగశాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ పేర్కొన్నారు. ప్రధాని హోదాలో కాకుండా.. బిమ్‌స్టెక్ ఛైర్మన్‌గా ఆయనకు ఆహ్వానం అందినట్లు తెలిపారు. "బ్రిక్స్ సదస్సుకు ఎలా వెళ్తాం? మా ప్రభుత్వం నుంచి ఎవరినైనా ఆహ్వానించారా? మా ప్రధానిని పిలవలేదు. ఆయన్ను ఆహ్వానించారని ఎవరు చెప్పారు?" అంటూ మీడియాతో మాట్లాడుతూ హుమాయున్ ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రధాని తొలి భారత పర్యటన.. అనేక దేశాలు భాగమయ్యే కార్యక్రమంలా ఉండదన్నారు. ద్వైపాక్షిక పర్యటనలు, చర్చలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. సమయం అనుకూలంగా ఉన్నప్పుడు, పరస్పర గౌరవంతో కూడిన పరిస్థితుల్లో ద్వైపాక్షిక పర్యటన జరుగుతుందని, దీనికి అంత తొందరేమీ లేదని వ్యాఖ్యానించారు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య 1996 నాటి గంగా జలాల పంపిణీ ఒప్పందం గడువు సమీపిస్తుండటంపై హుమాయున్ స్పందిస్తూ.. తమ జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై మాట్లాడుతూ.. ఈ విషయంలో ద్వైపాక్షిక చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నాయని చెప్పారు.




## ఈక్విటీల్లోకి నిధుల ప్రవాహం..

# రికార్డు స్థాయికి సిప్ పెట్టుబడులు

దిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్‌ల్లోకి నిధుల ప్రవాహం కొనసాగింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నా మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులకు మదుపర్లు ఉత్సాహం చూపుతుండడంతో ఆగస్టు నెలలోనూ పెద్ద మొత్తంలో నిధులు తరలాయి. మొత్తంగా ఈ విభాగంలోకి రూ.29,329 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (AMFI) గురువారం డేటాను విడుదల చేసింది. జులై నెలలో వచ్చిన రూ.24,697 కోట్లతో పోలిస్తే 19 శాతం పెరిగినట్లు తెలిపింది. రికార్డు స్థాయికి సిప్స్: క్రమానుగత పెట్టుబడి విధానం (SIP) ద్వారా ఆగస్టు నెలలో రూ.32,297 కోట్లు వచ్చినట్లు యాంఫీ డేటా వెల్లడించింది. జులై నెలలో ఈ మొత్తం రూ.31,961 కోట్లుగా ఉంది. గతేడాది ఆగస్టు నెలలో రూ.28,265 కోట్లతో పోలిస్తే ఈసారి 14 శాతం మేర పెరగడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఐదు నెల్లో సిప్ రూపంలో రూ.1.6 కోట్లు మ్యూచువల్ ఫండ్స్ స్కీముల్లోకి పెట్టుబడులు వచ్చాయి.

స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకే: ఆగస్టు నెలలో స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.7,973 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.6,989 కోట్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5059 కోట్లు నిధుల వచ్చినట్లు యాంఫీ డేటా వెల్లడించింది. అదే




సమయంలో లార్జ్‌క్యాప్ ఫండ్స్ నుంచి రూ.1147 కోట్లు నిధులు తరలిపోయినట్లు తెలిపింది. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.2,597 కోట్లు, సిల్వర్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.1271 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు పేర్కొంది. నికరంగా చూసినప్పుడు ఆగస్టు నెలలో మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలోకి నిధుల ప్రవాహం అంతకుముందు నెలతో పోలిస్తే తగ్గుముఖం పట్టడం గమనార్హం. జులైలో రూ.2.36 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. ఆగస్టులో రూ.41,353 కోట్లకే పరిమితం అయ్యాయి. ముఖ్యంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి నిధుల ఉపసంహరణ కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. ఈ స్కీముల్లోకి జులైలో రూ.1.88 లక్షల కోట్లు మేర పెట్టుబడులు రాగా.. ఆగస్టులో రూ.8,127 కోట్లు తరలిపోయాయి. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న ఆస్తుల మొత్తం రూ.85.76 లక్షల కోట్ల నుంచి రూ.87.08 లక్షల కోట్లకు పెరిగింది.

# ఇ-కామర్స్ రూల్స్: డిస్కౌంట్‌కు ముందు ధరెంతో చెప్పాల్సిందే!

ఆఫర్ల సీజన్‌కు ముందు ధరలు పెంచేసి.. తీరా కొనుగోలు సమయంలో భారీ డిస్కౌంట్ అంటూ పలు ఇకామర్స్ సంస్థలు చేసే మోసాలకు చెక్ పడనుంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో జరిగే మోసాలను అరికట్టడంలో భాగంగా కన్స్యూమర్ ప్రొటెక్షన్ రూల్స్, 2020ని కేంద్రం సవరించింది. ఉత్పత్తుల ధరల్లో పారదర్శకతను పెంచేందుకు, సెర్చ్ రిజల్ట్స్‌లో వినియోగదారులను తప్పుదోవ పట్టించకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సవరించిన నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సవరించిన నిబంధనల ప్రకారం.. ఏదైనా వస్తువుపై డిస్కౌంట్ ప్రకటించినప్పుడు, తగ్గింపు ధరతో పాటు అంతకుముందు ఉన్న అసలు ధరను కూడా స్పష్టంగా చూపించాలి. ఆఫర్ ప్రకటించడానికి ముందు ఉన్న 30 రోజుల్లో ఆ వస్తువు అత్యల్ప ధరనే అసలు ధరగా పరిగణించాలి. దీనివల్ల సేల్స్ కంటే ముందే ధరలను పెంచి, ఆ తర్వాత భారీ డిస్కౌంట్ ఇస్తున్నట్లు చూపించే మోసాలకు చెక్ పడనుంది.




- ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు తమ సెర్చ్ రిజల్ట్స్‌లో యూజర్లను తప్పుదోవ పట్టించకూడదు. వినియోగదారులు ఉత్పత్తులను వెతికే సమయంలో, తమకు లాభదాయకంగా ఉన్న లేదా తక్కువ ఆఫర్లు ఉన్న ఉత్పత్తులను కావాలని చూపించకూడదు. ప్రకటనల ద్వారా ప్రమోట్ చేసిన ఉత్పత్తులను వినియోగదారులు సులభంగా గుర్తించేలా స్పష్టత ఇవ్వాలి. సాధారణ ఉత్పత్తులకు, ప్రకటనల ద్వారా వచ్చే ఉత్పత్తులకు మధ్య తేడా స్పష్టంగా ఉండేలా చూడాలి.
- వస్తువుకు సంబంధించి ఎక్స్‌పైరీ డేట్, తయారైన దేశం, రీఫండ్ & రిటర్న్ పాలసీలు, వారంటీ, డెలివరీ సమయం, పేమెంట్ వివరాలను తప్పనిసరిగా తెలపాలి. వినియోగదారుల అనుమతి లేకుండా వారి వ్యక్తిగత వివరాలను ఇకామర్స్ సంస్థలు ఇతర అవసరాల కోసం ఉపయోగించకూడదు. ఏదైనా ఇతర ప్రయోజనాల కోసం డేటాను వాడాలంటే కస్టమర్ ధ్రువీకరణ తప్పనిసరి. మెంబర్‌షిప్ ప్రోగ్రామ్‌లు, చట్టబద్ధమైన సర్వీసులు మినహా కొనుగోలుకు సంబంధం లేని ఇతర సేవల పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయకూడదు. ప్రతి ఇకామర్స్ సంస్థ జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌తో తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలి. వినియోగదారులు నమోదు చేసే ఫిర్యాదు కాపీని వెంటనే వారికి అందజేయాలి.

# బ్యాంకుల దేశవ్యాప్త సమ్మె.. ఖాతాదారులకు SBI విజ్ఞప్తి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ బ్యాంకు యూనియన్లు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు అడ్వైజరీ జారీ చేసింది. సమ్మె కారణంగా సెప్టెంబర్ 11న బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని, అందువల్ల ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఈ నెల 11న సమ్మె నిర్వహించనుండడంతో తమ బ్యాంకు శాఖలు మూతపడనున్నాయని ఎస్‌బీఐ తెలిపింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలు, డిపాజిట్ వెండింగ్ మెషిన్లను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించింది. ప్రత్యామ్నాయంగా తమ కస్టమర్ సర్వీస్ పాయింట్లనూ వినియోగించుకోవాలని తెలిపింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఇతర డిజిటల్ వేదికలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని తెలిపింది. వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు సహా పలు డిమాండ్లపై యూఎఫ్‌బీయూ సమ్మెకు పిలుపునిచ్చింది. బ్యాంకుల పనితీరు ఆధారంగా ఉద్యోగులకు చెల్లించే ప్రోత్సాహకాలను సమీక్షించాలని, ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలిపివేయాలన్న డిమాండ్లతో సమ్మె చేపడుతోంది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మరోసారి సమ్మె చేస్తామని తెలిపింది. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాకుంటే




అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని బ్యాంక్ యూనియన్లు హెచ్చరిస్తున్నాయి.

# వచ్చే ఏడాది జులైలోగా.. పైలట్లందరికీ డ్రగ్ పరీక్షలు: డీజీసీఏ

అన్ని విమానయాన సంస్థల పైలట్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది. వచ్చే ఏడాది జులై నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఎయిర్‌లైన్లకు సూచించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, పైలట్ల డ్రగ్ పరీక్షలకు సంబంధించిన కొత్త నిబంధనల ముసాయిదాను సంబంధిత వర్గాలతో చర్చల అనంతరం ఈ నెలాఖరులోగా డీజీసీఏ ఖరారు చేసే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. గత నెలలో థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానం గాల్లో తీవ్ర కుదుపులకు లోనుకావడంతో



24 మంది ప్రయాణికులు గాయపడిన విషయం తెలిసిందే. అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల్లో పైలట్ ఇన్‌కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. అనంతరం సైకోయాక్టివ్ పరీక్షను నిర్వహించగా.. గంజాయి తీసుకున్నట్లు నిర్ధరణ అయ్యింది. దీంతో ఆ పైలట్‌ను ఎయిరిండియా విధుల నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలోనే అన్ని విమానయాన సంస్థల పైలట్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలంటూ డీజీసీఏ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. భారత్‌లో వివిధ విమానయాన సంస్థల్లో 12 వేలమందికి పైగా పైలట్లు ఉన్నారు. ప్రస్తుతం పైలట్లకు ర్యాండమ్ పద్ధతిలో డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీజీసీఏ సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ ప్రకారం.. ఏటా 10 శాతం మంది పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు తదితరులకు ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. థాయ్‌లాండ్ దిల్లీ విమాన ఘటన నేపథ్యంలో.. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లలోని పైలట్లందరికీ డ్రగ్ టెస్టులు నిర్వహించాలని ఎయిరిండియా గ్రూప్ ఇప్పటికే నిర్ణయించింది.

# లేటు వయసులోనూ.. దీటైన గేమ్

**నాలుగు పదుల వయసులోకి అడుగు పెట్టారంటే.. యువ కులతో ఏం పోటీపడతాంలే అని ఆటకు గుడ్‌బై చెప్పేసి ఏ కామెంటేటర్‌గానో.. అనలిస్ట్‌గానో మారిపోతారు కొందరు ప్లేయర్లు. మేం మాత్రం అలా కాదు.. కుర్రాళ్లకు సవాల్ విసిరేందుకు ఇప్పటికీ సై అంటూ దూసుకుపోతున్నారీ 'వెటరన్' ప్లేయర్లు..**






ఇమ్రాన్ తాహిర్.. అదేనండీ వికెట్ తీయగానే మైదానమంతా పరుగులు పెడతాడే ఆ వెటరన్ స్పిన్నర్ గుర్తున్నాడా? ఐపీఎల్‌లోనూ ఆడిన ఈ దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ తాజాగా ఓ ప్రపంచ రికార్డు సృష్టించాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో ఓ ఘనత నమోదు చేశాడు. ఫైఫర్ తీసిన అతిపెద్ద వయస్కుడిగా ఘనత సాధించాడు. కరేబియన్ ప్రిమియర్ లీగ్‌లో గయానా అమెజాన్ వారియర్స్ జట్టు సారథిగా ఉన్నాడు. సెయింట్ లూసియా కింగ్స్‌పై 17 పరుగులే ఇచ్చిన తాహిర్ 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో 47 ఏళ్ల 167 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యధిక వయసులో ఫైఫర్ తీసిన బౌలర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును తాహిర్ అధిగమించాడు. గతేడాదే ఇదే సీపీఎల్‌లో ఆ ఫీట్‌ను నమోదు చేశాడు. అప్పుడు అతడి వయసు 46 ఏళ్లు.

**నేను 50+ అండీ..**

మహిళల విభాగంలో 40 ఏళ్ల వరకూ క్రికెట్ ఆడటమే అరుదు. అలాంటిది ఐస్లే మ్యాన్ దేశానికి చెందిన జోన్ హిక్స్ మాత్రం 50+ అయినా సరే ఆడేస్తోంది. గత నెల ఆఖర్లో గ్రీస్‌తో జరిగిన మ్యాచ్‌లో హిక్స్ ఏకంగా ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. అప్పుడు ఆమె వయసు 51 ఏళ్లు కావడం గమనార్హం. మహిళల క్రికెట్‌లోనే కాదు.. ఓవరాల్‌గా ఇప్పటికీ అత్యధిక వయసులో ఫైఫర్ తీసిన బౌలర్‌గా హిక్స్ పేరిటే రికార్డు ఉంది. ఆస్ట్రేలియాకు చెందిన బెర్ట్ ఐరన్‌మోంగర్ 1932లో దక్షిణాఫ్రికాపై ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అప్పటికే ఆయన వయసు 49 ఏళ్లు. దానిని హిక్స్ అధిగమించింది.

**రోజర్ ఫెదరర్ కూడా..**

ఇటీవలే టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్ అందుకొన్న రోజర్ ఫెదరర్.. తనలో ఇంకా సత్తా ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. యూఎస్ ఓపెన్‌కు ముందు జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో రోజర్ ఫెదరర్ 63





తేడాతో ఆండీ రాడిక్‌పై విజయం సాధించాడు. రాడిక్ కూడా మాజీనే. అయితే, ఫెదరర్ ఆటతీరు ఇప్పటికీ మారలేదని.. అతడికి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వాలనే డిమాండ్లూ వచ్చాయి. ఇప్పటికే విలియమ్స్ సిస్టర్స్ ఇలానే మళ్లీ రాకెట్ పట్టిన సంగతి తెలిసిందే. నాలుగేళ్ల కిందట ప్రొఫెషనల్ టెన్నిస్ ఆడిన వీరిద్దరూ మళ్లీ కోర్టులోకి దిగారు. ఓటమి ఎదురైనా వారి ఆట మాత్రం అభిమానులను ఆకట్టుకుంది.

**ఆగని మెస్సి మాయ..**

ఫుట్‌బాల్ మాంత్రికుడు లియోనెల్ మెస్సి అంతర్జాతీయ ఆటకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. నాలుగు పదుల వయసుకు చేరువగా ఉన్న అతడు అర్జెంటీనా తరఫున తన చివరి మ్యాచ్‌ను గత ప్రపంచ కప్‌లో ఆడేశాడు. తన తండ్రి మరణించిన తర్వాత భావోద్వేగంతో జాతీయ జట్టుకూ గుడ్‌బై చెప్పేశాడు. అయితే, తనలో ఇంకా ఆట తగ్గలేదు నిరూపించాడీ ఫుట్‌బాల్ స్టార్. మేజర్ లీగ్ సాకర్ టోర్నీలో ఇంటర్ మియామీ క్లబ్‌కు ఆడుతూ గోల్ కొట్టడమే కాకుండా.. అసిస్ట్స్‌తో తన సహచరులు గోల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. మైదానంలోనూ చురుగ్గా పరుగులు పెడుతూ ఉత్సాహం తెప్పించాడు.




# ఆసియా కప్.. ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

దుబాయ్: మహిళల ఆసియా కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 150 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులకే పరిమితమైంది. షోర్నా అక్తర్ 22*, నిగర్ సుల్తానా 19, శోభనా మోస్త్రరీ 18, డిలారా అక్తర్ 21, జువారియా ఫెర్దోస్ 14, ఫహీమా ఖాటున్ 14 రన్స్ చేశారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందనీ శర్మ 2 వికెట్లు పడగొట్టారు. శ్రీచరణి, ప్రేమ రావత్ చెరో వికెట్ తీశారు. చివరి రెండు బంతులకు నందనీ శర్మ రెండు వికెట్లు తీసింది. శ్రీలంక, పాకిస్థాన్ జట్ల మధ్య శుక్రవారం రెండో సెమీఫైనల్ జరగనుంది. ఇందులో గెలిచే జట్టుతో భారత్ ఈ నెల 13న ఫైనల్‌లో తలపడుతుంది. 15 ఓవర్లకు బంగ్లాదేశ్ 76/4 పరుగులు చేసింది. షోమా అక్తర్ 4* (5 బంతుల్లో), షర్మీన్ అక్తర్ 0* క్రీజులో ఉన్నారు. నిగర్ సుల్తానా 19, శోభనా మోస్త్రరీ 18, డిలారా అక్తర్ 21, జువారియా ఫెర్దోస్ 14 రన్స్ చేసి ఔటయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 2 వికెట్లు.. శ్రీచరణి, ప్రేమ రావత్ చెరో వికెట్ తీశారు. బంగ్లాదేశ్ విజయానికి .. 30 బంతుల్లో 74 రన్స్ కావాల్సి ఉంది. దీంతో బంగ్లాదేశ్ కష్టాల్లో పడింది. 12 ఓవర్లకు బంగ్లాదేశ్ 56/2 పరుగులు చేసింది. శోభనా మోస్త్రరీ 11* (18 బంతుల్లో), నిగర్ సుల్తానా 11* (10 బంతుల్లో) క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ విజయానికి .. 48 బంతుల్లో 93 రన్స్ కావాల్సి ఉంది. 8 ఓవర్లకు బంగ్లాదేశ్ 35/2 పరుగులు చేసింది. శోభనా మోస్త్రరీ , నిగర్ సుల్తానా క్రీజులో ఉన్నారు. డిలారా అక్తర్ 21, జువారియా ఫెర్దోస్ 14 రన్స్ చేసి ఔటయ్యారు. భారత బౌలర్లలో శ్రీచరణి, దీప్తిశర్మ చెరో వికెట్ తీశారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 149/6 రన్స్ చేసింది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఆసియా కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో టీమ్‌ఇండియా 6 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ (64) దూకుడుగా ఆడింది. మిగతా వారు నిరాశపరిచారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (24*), రిచా ఘోష్ (21), ప్రతీక రావల్ (20), దీప్తి శర్మ (13), స్మృతి మంధాన (2) పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖతున్ 2, నహిదా అక్తర్ రబేయ ఖాన్, మరుఫా అక్తర్ ఒక్కో వికెట్ తీశారు. 15 ఓవర్లు పూర్తయ్యే సరికి భారత్ 3 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత ఓపెనర్ షెఫాలీ వర్మ (64: 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్) అర్ధశతకం చేసింది. ప్రస్తుతం క్రీజులో కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (5), రిచా ఘోష్ (1) క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఆసియాకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్ 10




ఓవర్లు ముగిసే సరికి రెండు వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసింది. క్రీజులో షెఫాలీ వర్మ (34: 27 బంతుల్లో), హర్మన్ ప్రీత్‌కౌర్ ఉన్నారు. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన (2) విఫలమైంది. రెండో ఓవర్ చివరి బంతికి సుల్తానా బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి ఔటైంది. అనంతరం వచ్చిన ప్రతీక రావల్ (20: 24 బంతుల్లో)తో కలిసి షెఫాలీ వర్మ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. రెండో వికెట్‌కు వీరి జోడి 50 పరుగులు చేసింది. అయితే కుదురుకుంటున్న సమయంలో ప్రతీక రావల్.. రబేయ ఖాన్ బౌలింగ్‌లో దిలారాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది.

# టార్గెట్ అజిత్ అగార్కర్.. రోహిత్ శర్మ 'టీ షర్ట్' వైరల్



భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మైదానంలో ఎంత సరదాగా ఉంటాడో, గ్రౌండ్ వెలుపల కూడా అంతే చలాకీగా ఉంటాడు. తోటి ఆటగాళ్లు, ఫ్రెండ్స్‌తో జాలీగా ఉంటూ తనదైన స్టైల్‌లో పంచ్‌లు విసురుతుంటాడు. అప్పుడప్పుడు అవి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తాయి. తాజాగా రోహిత్ సైలెంట్‌గా వేసిన ఓ కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. టీమ్‌ఇండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ఉద్దేశించే ఈ కౌంటర్ ఇచ్చాడని నెటిజన్లను చర్చించుకుంటున్నారు. ఇంతకీ అసలు విషయం ఏంటంటే.. సెప్టెంబరు 19 నుంచి బుల్లితెరపై ప్రసారం కానున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే ఎంటర్‌టైన్‌మెంట్ షో ద్వారా హోస్ట్‌గా హిట్‌మ్యాన్ కొత్త అవతారం ఎత్తబోతున్నాడు. ఈ షోకు సంబంధించిన ప్రోమో షూటింగ్ సమయంలో రోహిత్ వైట్ కలర్ టీ షర్ట్ ధరించి కెమెరాతో మాట్లాడాడు. ఆ టీ షర్ట్‌పై కమిట్‌మెంట్ లేదా? అని రాసి ఉంది. నోటితో ఏమీ అనకపోయినా ఈ కోట్‌తో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను రోహిత్ టార్గెట్ చేశాడని నెట్టింట అభిమానులు చర్చించుకుంటున్నారు. ఏంటి గొడవ? తేడాది అక్టోబర్‌లో శుభ్‌మన్ గిల్‌ను వన్డే కెప్టెన్‌గా ప్రకటించినప్పుడు రోహిత్, విరాట్ కోహ్లి 2027 ప్రపంచ కప్ ఆడే విషయంలో కమిట్మెంట్‌తో లేరని అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించాడు. దానికి ఫిబ్రవరిలోనే రోహిత్ ఓ కౌంటర్ ఇచ్చాడు. దేశం తరఫున ట్రోఫీలు గెలవాలనే కమిట్మెంట్, ఆకలి తమకు పుష్కలంగా ఉన్నాయన్నాడు. ఇప్పుడు డైరెక్ట్‌గా అజిత్ అగార్కర్ ఉపయోగించిన ఆ పదాన్నే టీ షర్ట్‌పై ముద్రించుకుని రోహిత్ మరోసారి వార్తల్లో నిలిచాడు.

సినిమా



# ఆయన వల్లే మళ్లీ తెర పైకి

భర్త రాజ్ నిడిమోరుపై సమంత ప్రశంసలు కురిపించింది. ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు బ్రేక్ ఇచ్చిన ఆమె మా ఇంటి బంగారం ముందు తన కెరీర్‌లో ఎదురైన కష్టాలపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్లు చేసింది. సెట్స్‌లో అందరూ మేకప్ వేసుకొని నా కోసం ఎదురుచూసేవాళ్లు. నా వల్లే టైమ్ వేస్ట్ అనే భావన ప్రతి ఒక్కరిలో కనిపించేది. నా వల్ల ఇంకొకరు ఇబ్బందులు పడొద్దనుకుని సినిమాలు మానేయాలని ఫిక్సయ్యా. చాలా స్క్రిప్ట్‌లు రిజెక్ట్ చేశా. ప్రొడ్యూసర్‌గా సినిమాలు చేస్తూ తెర వెనుకే ఉండిపోవాలనుకున్నా. ఆ టైమ్‌లోనే రాజ్ నా లైఫ్‌లోకి వచ్చాడు. నాలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. కష్టకాలంలో నన్ను మరింత స్ట్రాంగ్‌గా మార్చాడు అంటూ చెప్పుకొచ్చింది సమంత. ప్రస్తుతం ఆమె కామెంట్స్ వైరలవుతున్నాయి.



# అనస్వర జోరు

మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ టాలీవుడ్‌లో తన జోరు పెంచుతోంది. దర్శకనిర్మాతలు ఈ అమ్మడి డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో మూడు సినిమాలు చేస్తోంది ఈ చిన్నది. చిరంజీవి కాకాలో ఓ కీలక పాత్రలో నటిస్తున్న ఈ మలయాళ భామ మరో రెండు సినిమాల్లో కథానాయికగా కనిపించబోతుంది. ప్రస్తుతం ఇట్లు అర్జునతో పాటు అంతా రాములోరు చూస్కుంటారు సినిమాలు చేస్తోంది. అక్టోబర్ 9న రిలీజ్ కాబోతున్న ఇట్లు అర్జున మూవీని డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. ఈ మూడు సినిమాలే కాకుండా 7జీ బృందావన కాలనీ సీక్వెల్‌లో ఈ మలయాళ ముద్దుగుమ్మ నటిస్తోంది. హీరోయిన్‌గా మరో రెండు కొత్త సినిమాలు కూడా డిస్కషన్స్ స్టేజ్‌లో ఉన్నట్లు సమాచారం.



# తెలంగాణ యాస నేర్చుకొని..

పెళ్లి బరాత్‌లో మాస్ స్టెప్పులు వేసింది అనుపమ పరమేశ్వరన్. క్రేజీ కళ్యాణం ఫస్ట్ సింగిల్ ప్రోమోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ ప్రోమోలో పెళ్లి కూతురు గెటప్‌లో ఉన్న అనుపమ బరాత్‌లో డ్యాన్స్‌తో దుమ్ము రేపింది. కాకా ధూమ్ ధమాకా అంటూ సాగే ఈ పాటలో ఈ అమ్మడితో పాటు సీనియర్ నరేష్, తరుణ్ భాస్కర్ కలిసి డ్యాన్స్ చేయబోతున్నారు. తన పాత్ర కోసం తెలంగాణ యాస నేర్చుకొని సొంతంగా డబ్బింగ్ చెప్పింది అనుపమ. ఆమె ఓన్ వాయిస్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. నవంబర్‌లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఈనెల 12న ఫుల్ సాంగ్ రిలీజ్ కాబోతుంది. ఈ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా సురేష్ బొబ్బిలి మ్యూజిక్ సమకూర్చారు.



# వెంకటేశ్వర స్వామిగా టాలీవుడ్ ఎంట్రీ

కోలీవుడ్ అగ్ర నటుడు జయం రవి టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. మంచు మనోజ్ హీరోగా వడ్డీకాసుల వాడ పేరుతో సోషియా ఫాంటసీ కామెడీ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వెంకటేశ్వర స్వామి పాత్రలో జయం రవి కనిపించబోతున్నాడు. ఈ విషయాన్ని జయం రవి ట్విట్టర్ ద్వారా గురువారం అఫీషియల్‌గా ప్రకటించారు. అప్పులు, ఈఎంఐల బాధ నుంచి బయటపడేందుకు ఓ మిడిల్ క్లాస్ యువకుడు చేసే ప్రయత్నాలను వినోదాత్మకంగా చూపించబోతున్నారు. వడ్డీకాసుల వాడ పేరుతో తెరకెక్కుతున్న ఈ మూవీకి తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. కాగా పుట్టినరోజు సందర్భంగా దేవుడు ఇచ్చిన గిఫ్ట్ ఇది అంటూ ఓ పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నాడు రవి. వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానున్నట్లు టాక్ వినిపిస్తుంది.



ఈ వినాయక చవితిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని రౌడీ హీరో విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు. అందరూ సురక్షితమైన మట్టి గణపతి, విత్తన గణపతిని వాడాలని.. తద్వారా మన నగరం కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రీన్ ఇండియా చాలెంట్ ప్రతినిధులు ఆయన నివాసంలో విత్తన గణపతి ప్రతిమను విజయ్ కు అందేశారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ.. తాను ఇప్పడే విత్తన గణపతిని స్వీకరించానని.. పూజల తర్వాత ఈ విగ్రహం నుంచి మొక్క పెరుగుతుందని తెలిపారు.